Follow: @ANNTELUGU

ANN తెలుగు

09-06-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 160 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

నేను పనులకు ఒప్పిస్తే..

## కిషన్ రెడ్డి వెళ్ళి అడ్డుతగులుతున్నాడు

- సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- హైదరాబాద్ లో లక్ష ఇళ్ళు కట్టిస్తాం


02



**హైదరాబాద్ (మియాపూర్), మహా** : హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు కట్టి పేద ప్రజలకు ఇస్తామని, తాను ఢిల్లీకి వెళ్లిన 3 రోజుల తర్వాత కిషన్‌రెడ్డి వెళ్లి అన్ని పనులకు అడ్డుతగులుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఢిల్లీకి ఇద్దరం కలిసి వెళదాం అంటే కిషన్‌రెడ్డి రావట్లేదన్నారు. తాను మోదీని కలిసిన 3 రోజుల తర్వాత కిషన్‌రెడ్డి కలుస్తున్నారని, తాను ఏ కేంద్రమంత్రిని కలిస్తే 3 రోజుల తర్వాత కిషన్‌రెడ్డి వెళ్లి కలుస్తున్నట్లు చెప్పారు. తాను వెళ్లి ప్రాజెక్టుల కోసం ప్రధానిని, కేంద్రమంత్రులను

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్





బతుకుపై బండ

04

## రేవంత్‌కు హిట్లర్ తంటా

భగ్గుమన్న మాజీ సీఎం విజయన్ కాంగ్రెస్ సమాధానం చెప్పాలని ఫైర్




02

## దేవెగౌడకు టాటా

ముగిసిన పార్లమెంటరీ ఇన్నింగ్స్ మరో అభ్యర్థిని ప్రకటించిన బిజెపి



02



## పశ్చిమాసియాలో మళ్లీ క్షిపణి మోతలు

- ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణలపై భారత్ తీవ్ర ఆందోళన

02

## మీడియా అక్రిడిటేషన్ల జీవోపై.. ప్రభుత్వానికి షాక్

- హైకోర్టులో వాదనలు.. జీవో రద్దుచేయాలన్న పిటిషనర్



02

# దసరా తర్వాత గ్రేటర్ వార్

జీహెచ్ఎంసీ ఎన్నికలపై సీఎం ఫోకస్


సిటీలో పర్యటనలు.. సవాళ్ళ వ్యూహం అదే

మూడు కార్పోరేషన్లపై.. గ్రౌండ్ వర్క్

అభ్యర్థులు, బలాబలాలపై సర్వేలు

**(హైదరాబాద్ మహా):** గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోకస్ పెట్టినట్లు కనబడుతోంది. సిటీలోని ప్రధాన నియోజకవర్గాల్లో వరుస పర్యటనలు, శంఖుస్థాపనల వెనుక ఎన్నికల వ్యూహమే ప్రధాన కారణమని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ లో డివిజన్ల సంఖ్యను పెంచి మూడు కార్పోరేషన్లుగా విభజించగా, తొలిసారి గ్రేటర్ సైబరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్, గ్రేటర్ మల్కాజగిరి మునిసిపల్ కార్పోరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రేటర్ ఎన్నికలను ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారో స్పష్టమవుతోంది. ఫిబ్రవరి 2026లో ప్రభుత్వం పాత జీహెచ్ఎంసీని మూడు వేర్వేరు కార్పోరేషన్లుగా విభజించిన తర్వాత రాబోయే ఈ ఎన్నికలు తెలంగాణ రాజకీయాల్లో ఒక మైలురాయి కానున్నాయి. కాంగ్రెస్ పార్టీ గత మూడు జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ సరిగ్గా సామర్థ్యాన్ని ప్రదర్శించలేదు. గ్రేటర్ విభజన వ్యూహం వెనుక రేవంత్ ఎన్నికల తంత్రం ఉందని అందరూ భావిస్తున్నారు. నగరం శరవేగంగా విస్తరిస్తుండటంతో పరిపాలనను సులభతరం చేయడానికి పాత జీహెచ్ఎంసీని మూడు స్వతంత్ర కార్పోరేషన్లుగా మార్చారు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ ప్రధానంగా సెంట్రల్, సౌత్ హైదరాబాద్ పరిధిని కవర్ చేస్తుంది. గ్రేటర్ సైబరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ వెస్ట్ హైదరాబాద్ (ఐటీ కారిడార్ మాదాపూర్, గచ్చిబౌలి, మియాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి వంటి ప్రాంతాలు) పరిధిలోకి

మిగతా 2వ పేజీలో







జీహెచ్ఎంసీ ఎన్నికల కోసమే

## సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, మహా** : జీహెచ్ఎంసీ ఎన్నికల కోసమే సీఎం రేవంత్ రెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. 12 ఏళ్లలో జరిగిన అభివృద్ధి, సంస్కరణల గురించి ప్రెస్ బ్రీఫింగ్ లో కిషన్ రెడ్డి వివరించారు. సింగరేణికి సంబంధించి.. రెండేళ్లలో.. ఖర్చులు తగ్గించే ప్రయత్నం చేశానని తెలిపారు. సింగరేణికి కార్మికులకు న్యాయం చేసే ప్రయత్నం చేశానని అన్నారు. కోలిండియాతోపాటుగా సింగరేణి ఉద్యోగస్తులకు ఇన్సూరెన్స్ పెంచామని, గతంలో 30 లక్షలు, 40 లక్షలుండే ప్రమాదబీమాను.. కోటి రూపాయలకు పెంచామని, ఇవాళ్టి లెక్కల ప్రకారం.. కోటి 25 లక్షల వరకు వారికి ప్రమాదబీమా వస్తుందన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. సింగరేణి ఉద్యోగుల ఇన్ కమ్ టాక్స్ మినహాయింపు చేస్తానని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలను అడిగితే.. వారు చేయలేదని, మేం 2028లో అధికారంలోకి రాగానే.. కచ్చితంగా వారికి ఆదాయపుపన్ను మినహాయింపు ఇస్తామని స్పష్టం చేశారు.



## కేంద్రంపై ఇండియా కదనభేరి

- నీట్ లీకేజీపై భగ్గుమన్న విపక్షాలు.
- తక్షణమే విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టు.
- ఆగస్టులో హైదరాబాద్ వేదికగా తదుపరి భేటీ.
- కూటమి పక్షాలపై కాంగ్రెస్ విమర్శలు చేయొద్దని సూచన

03



విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో

## ఘోర ప్రమాదం

స్పాట్ లోనే 9 మంది మృతి, పలువురికి గాయాలు

ప్లాంట్‌లో ఉక్కు ద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ప్రమాదం

02





ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రలో రష్మిక

03





# దసరా తర్వాత గ్రేటర్ వార్

( మొదటి పేజీ తరువాయి )

వస్తుంది. గ్రేటర్ మల్కాజగిరి మునిసిపల్ కార్పోరేషన్ ఈస్ట్ మరియు నార్త్ హైదరాబాద్ (మల్కాజగిరి, ఉప్పల్, ఎల్బీనగర్, అల్వాల్ వంటి ప్రాంతాలు) పరిధిని చూస్తుంది.

**దసరా తర్వాత 'గ్రేటర్ వార్' ఎందుకు?**

పాత జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు ముగిసినప్పటికీ, విభజన ప్రక్రియ, కొత్త డివిజన్ల/వార్డుల పునర్విభజన (డెలిమిటేషన్) మరియు ఓటర్ల జాబితా తయారీకి సమయం పడుతుంది. అందుకే వర్షాకాలం ముగిసి, పండుగల సీజన్ (దసరా) దాటిన తర్వాత ఈ మూడు కార్పోరేషన్లకు ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం గ్రౌండ్ వర్క్ చేస్తోంది.

**సీఎం రేవంత్ రెడ్డి 'సవాళ్ళ వ్యూహం'**

సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే నగరంలో రూ. వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు మియాపూర్‌లో జరిగిన 'ప్రజాపాలన అభివృద్ధి ప్రణాళిక' సభ మరియు కొత్త సైబరాబాద్ కార్పోరేషన్ ఆఫీస్ బిల్డింగ్ భూమిపూజ). మూసి నది పునరుజ్జీవనం, మెట్రో రైల్ విస్తరణ వంటి ప్రాజెక్టులతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం జరుగుతోంది. గతంలో గ్రేటర్ పరిధిలో బీఆర్ఎస్, బీజేపీ బలంగా ఉన్న నేపథ్యంలో.. ఈసారి క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలాబలాలపై రేవంత్ రెడ్డి నిరంతరం ఇంటెలిజెన్స్ మరియు ప్రైవేట్ ఏజెన్సీలతో సర్వేలు చేయిస్తున్నారు. గెలిచే గుర్రాలకే సీట్లు ఇచ్చేలా అభ్యర్థుల స్క్రీనింగ్ ముందే మొదలైంది. ఈ త్రిముఖ మునిసిపల్ పోరులో హైదరాబాద్‌పై పట్టు సాధించేందుకు అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్, బీజేపీలు సరికొత్త వ్యూహాలతో సిద్ధమవుతున్నాయి.

**ముచ్చటగా.. మూడు**

ఫిబ్రవరి 2026లో తెలంగాణ ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిధిని విస్తరించి, పరిపాలనా సౌలభ్యం కోసం దానిని




3 స్వతంత్ర మునిసిపల్ కార్పోరేషన్లుగా విభజించింది. మొత్తం మెట్రోపాలిటన్ పరిధిని 12 జోన్లు, 60 సర్కిళ్లు, మరియు 300 వార్డులుగా (డివిజన్లు) పునర్వ్యవస్థీకరించారు.

**1. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్**

ఇది పాత నగరం (ఓల్డ్ సిటీ), సెంట్రల్ మరియు సౌత్ హైదరాబాద్ పరిధిని కవర్ చేస్తుంది. దీని వైశాల్యం దాదాపు 689 చదరపు కిలోమీటర్లు.

జోన్లు: 6 (శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్)

సర్కిళ్లు: 30

**డివిజన్లు (వార్డులు):** 150

**జోన్లు, సర్కిళ్ల వివరాలు:**

ఖైరతాబాద్ జోన్ (29 వార్డులు): ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్ సర్కిళ్లు.

చార్మినార్ జోన్ (25 వార్డులు): సంతోష్ నగర్, యాకుత్‌పురా, మలక్‌పేట్, చార్మినార్, మూసారాంబాగ్ సర్కిళ్లు.

**సికింద్రాబాద్ జోన్ (28 వార్డులు):** కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ సర్కిళ్లు.

గోల్కొండ జోన్ (28 వార్డులు): గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహదీపట్నం, మాసబ్ ట్యాంక్ సర్కిళ్లు.

**రాజేంద్రనగర్ జోన్ (29 వార్డులు):** రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పురా, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్ సర్కిళ్లు.

శంషాబాద్ జోన్ (11 వార్డులు): శంషాబాద్, శంషాబాద్ రూరల్ పరిసర ప్రాంతాలు (ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్పల్లి వంటి విలీన మున్సిపాలిటీల భాగాలు).

**2. గ్రేటర్ సైబరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్**

ఇది పూర్తిగా పశ్చిమ, వాయువ్య హైదరాబాద్ (ఐటీ కారిడార్ మరియు దాని చుట్టుపక్కల శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు) పరిధిని కవర్ చేస్తుంది. దీని వైశాల్యం దాదాపు 603 చదరపు కిలోమీటర్లు.

జోన్లు: 3 (శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్)

**సర్కిళ్లు:** 16 డివిజన్లు (వార్డులు): 76

**జోన్లు & సర్కిళ్ల వివరాలు:**

శేరిలింగంపల్లి జోన్ (26 వార్డులు): శేరిలింగంపల్లి, మియాపూర్, నార్సింగి, పటాన్‌చెరు, అమీన్‌పూర్ సర్కిళ్లు.

**కూకట్‌పల్లి జోన్ (23 వార్డులు):** కూకట్‌పల్లి, మూసాపేట్, మాదాపూర్, ఆల్విన్ కాలనీ సర్కిళ్లు.

కుత్బుల్లాపూర్ జోన్ (27 వార్డులు): చింతల్, జీడిమెట్ల, కొంపల్లి, గాజులరామారం, నిజాంపేట్, దుండిగల్, మేడ్చల్ సర్కిళ్లు

**3. గ్రేటర్ మల్కాజగిరి మునిసిపల్ కార్పోరేషన్**

ఇది తూర్పు మరియు ఈశాన్య హైదరాబాద్ (ప్రధాన నివాస ప్రాంతాలు, విలీన శివారు మున్సిపాలిటీలు) పరిధిని కవర్ చేస్తుంది.

భౌగోళికంగా 734 చదరపు కిలోమీటర్లతో ఇదే అతిపెద్ద వైశాల్యం కలిగిన కార్పోరేషన్.

జోన్లు: 3 (మల్కాజగిరి, ఉప్పల్, ఎల్బీనగర్)

సర్కిళ్లు: 14డివిజన్లు (వార్డులు): 74

**జోన్లు & సర్కిళ్ల వివరాలు:**

మల్కాజగిరి జోన్ (26 వార్డులు): మల్కాజగిరి, అల్వాల్, మౌలాలీ, బోయిన్‌పల్లి, కీసర సర్కిళ్లు.

ఉప్పల్ జోన్ (24 వార్డులు): ఉప్పల్, కాప్రా, నాచారం, ఘట్‌కేసర్, బోడుప్పల్ సర్కిళ్లు.

**ఎల్బీనగర్ జోన్ (24 వార్డులు):** ఎల్బీనగర్, సరూర్‌నగర్, నాగోల్, హయత్‌నగర్ సర్కిళ్లు.

# రేవంత్ కు హిట్లర్ తంటా

**భగ్గుమన్న మాజీ సీఎం విజయన్**
**కాంగ్రెస్ సమాధానం చెప్పాలని ఫైర్**



**మహా :** బెంగళూరులో జరిగిన ఓ సదస్సులో హైడ్రా ఏర్పాటుపై సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. 'హైడ్రా'ను హిట్లర్ స్ఫూర్తితో ఏర్పాటు చేశానని సీఎం రేవంత్ చెప్పడంపై కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత పినరయి విజయన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇది ఆయన ఫాసిస్ట్ మనస్తత్వాన్ని బట్టబయలు చేస్తోందని విమర్శించారు. సీఎం రేవంత్ వ్యాఖ్యలపై కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తీవ్రంగా స్పందించారు. రేవంత్ వ్యాఖ్యలను ఆయన పూర్తిగా తప్పుబట్టారు. 'తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తాను స్థాపించిన 'హైడ్రా'ను హిట్లర్ నుంచి స్ఫూర్తి పొంది ఏర్పాటు చేశానని గర్వంగా చెప్పుకోవడం నిజంగా దౌర్భాగ్యం . ఈ వ్యాఖ్యలు ఆయన ఆర్ఎస్ఎస్ నేపథ్యాన్ని, ఫాసిస్ట్ మనస్తత్వాన్ని బట్టబయలు చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్టానం దేశ ప్రజలకు కచ్చితంగా సమాధానం చెప్పాలి' అని విజయన్ డిమాండ్ చేశారు.

# దేవెగౌడకు టాటా

**ముగిసిన పార్లమెంటరీ ఇన్నింగ్స్**
**మరో అభ్యర్థిని ప్రకటించిన బిజెపి**



బెంగళూరు: జేడీఎస్ చీఫ్, మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ పార్లమెంటరీ ఇన్నింగ్స్ ముగిసింది. కర్ణాటకలో పొత్తులో భాగంగా మరోసారి రాజ్యసభ టిక్కెట్‌ను దేవెగౌడకు ఇవ్వాలని జేడీఎస్ ఆశించింది. అయితే బీజేపీ తమ రాజ్యసభ అభ్యర్థిగా ప్రొఫెసర్ ఎం.నాగరాజును ప్రకటించింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. జేడీఎస్, దేవెగౌడ మద్దతు వాడుకుని చివరకు రాజ్యసభ సీటు నిరాకరించారని, ఇది జేడీఎస్‌కు మాత్రమే కాకుండా కర్ణాటక ప్రజలకు జరిగిన అవమానమని ఆ పార్టీ సీనియర్ నేత, కర్ణాటక కాంగ్రెస్ ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా విమర్శించారు. ఆదివారం అర్ధరాత్రి బీజేపీ ఒక నిర్ణయం తీసుకుంది. మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడకు రాజ్యసభ నామినేషన్‌ను నిరాకరించింది. ఆయనకు బదులుగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, డిస్ట్రిక్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ ఇన్‌చార్జి ఎం.నాగరాజును తమ అభ్యర్థిగా ఎంపిక చేయాలని నిర్ణయించింది' అని సూర్జేవాలా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. భాగస్వామ్య పార్టీల మద్దతు వాడుకుని ఆ తర్వాత వదిలి వేయడం బీజేపీకి అలవాటేనని, ఇప్పుడు జేడీఎస్‌ను మరోసారి అవమానించిందని అన్నారు. కేవలం మంత్రి పదవి కోసం హెచ్‌డీ కుమారస్వామి ఈ అవమానాన్ని భరించడం విస్మయం కలిగిస్తుందని, ఇప్పటికైనా కనువిప్పు కలగాలని పేర్కొన్నారు. పార్లమెంటులో అనేక బిల్లులు ఆమోదం పొందేందుకు జేడీఎస్, దేవెగౌడ మద్దతును బీజేపీ తీసుకుందని గుర్తు చేశారు. అయితే ఈ విధమైన వంచనకు ఆ పార్టీ పాల్పడుతుందని ఎవరూ ఊహించి ఉండరని, ఇది కర్ణాటక ప్రజలను కూడా అవమానించడమేనని అన్నారు. ఇందుకు బీజేపీ, ఎన్డీయేలను ప్రజలు భవిష్యత్తులో శిక్షించక మానరని చెప్పారు. కర్ణాటకలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఈనెల 18న ఎన్నికలు జరగాల్సిండగా, అసెంబ్లీలో సంఖ్యాబలం ఆధారంగా 3 సీట్లను కాంగ్రెస్, ఒక సీటు బీజేపీకి సునాయాసంగా గెలుచుకోగలవు. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులుగా మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీ ఖాన్, పార్టీ మీడియా, పబ్లిసిటీ విభాగం చైర్మన్ పవన్ ఖేడాను ప్రకటించింది. 224 మంది సభ్యుల కర్ణాటక అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 135 మంది ఎమ్మెల్యేల బలం ఉండగా, బీజేపీకి 62, జేడీఎస్‌కు 18 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

# మీడియా అక్రిడిటేషన్ల జీవోపై..ప్రభుత్వానికి షాక్

**హైకోర్టులో వాదనలు.. జీవో**
**రద్దుచేయాలన్న పిటిషనర్**

హైదరాబాద్, మహా : రాష్ట్ర,జిల్లా స్థాయి మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో ఆర్టీ 229ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ నిబంధనల అమలుపై ఉన్న అభ్యంతరాలపై ప్రభుత్వం నుంచి కోర్టు సంజాయిషీ కోరింది. జస్టిస్ అపరేష్ కుమార్, జస్టిస్ మొహినుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ కేసును విచారించింది. ఏవీఎన్ టీవీ కరస్పాండెంట్ నంబి పర్వతాలు దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ప్రధానంగా అక్రెడిటేషన్ కమిటీల కూర్పును తప్పుబట్టారు. గతంలో అమల్లో ఉన్న జీవో 252 నిబంధనల ప్రకారం.. అక్రెడిటేషన్ కమిటీలో నాలుగు జర్నలిస్టు యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉందని, అయితే ప్రస్తుత జీవో 229 ద్వారా ప్రభుత్వం ఆ నిబంధనలను పక్కన పెట్టిందని పిటిషనర్ తరపు న్యాయవాది రఘు వాదనలు వినిపించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు అవకాశం ఇవ్వకుండా, కేవలం మూడు యూనియన్లతోనే కమిటీలను ఏర్పాటు చేసి కార్డులు జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిబంధనలను తుంగలో తొక్కినందున ఈ జీవోను రద్దు చేయాలని కోరారు. పిటిషనర్ తరఫు వాదనలు విన్న ధర్మాసనం, దీనిపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదిని ఆదేశించింది. అయితే, ఈ రిట్ పిటిషన్‌కు సంబంధించిన ఫైల్ తనకు అందలేదని ప్రభుత్వ తరపు న్యాయవాది కోర్టుకు తెలపగా, దానిపై పిటిషనర్ న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్లీడర్‌కు జీపీ పిటిషన్ కాపీలు అందజేయకుండా కోర్టులో కేసు నంబర్ నమోదు కావడం అసాధ్యమని వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది.





# విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

- **స్పాట్ లోనే 9 మంది మృతి, పలువురికి గాయాలు**
- **ప్లాంట్‌లో ఉక్కు ద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ప్రమాదం**



**విశాఖపట్టణం, మహా :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం స్టీల్ ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్2, ఎస్టీసీ3 హీట్ ఎఫ్‌జీలో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ ఒక్కసారిగా పేలడంతో ఉక్కుద్రవం లీకైంది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో 9 మంది అక్కడికక్కడే మృతిచెందగా పలువురు క్షతగాత్రులయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 1500 డిగ్రీల వేడితో స్టీల్ మెటల్ లిక్విడ్‌ను ల్యాడిల్ ద్వారా ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తున్న క్రమంలో ప్రమాదం జరిగినట్లుగా సమాచారం. ప్రమాద ఘటనతో స్టీల్ ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. సమాచారమందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టారు.

**మృతులు వీరే**

ఈ ప్రమాదంలో అప్పారావు, కృష్ణ, ప్రభాకర్ రావు, అప్పలరాజు, త్రినాథ్, రమణ, కుమార్‌లు మృతిచెందినట్లుగా గుర్తించారు. మరో ఇద్దరికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. వీరిలో ఐదుగురు విశాఖ ఉక్కు కర్మగాయం ఉద్యోగులు కాగా, ముగ్గురు ఒప్పంద కార్మికులని అధికారులు వివరించారు. మరోవైపు రావూరి మల్లికార్జునరావు, అర్జున అప్పారావు, సూరిబాబు, పల్లెల శ్రీనివాస్, సత్యనంద్, పైడిరాజులను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

ప్రమాద ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై ఆయన అధికారులతో మాట్లాడారు. పలువురు కార్మికులు చనిపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన ఆయన ప్రస్తుత పరిస్థితిని తెలుసుకున్నారు. సహాయక చర్యల గురించి స్టీల్ ప్లాంట్ అధికారులు సీఎంకు వివరించారు. అన్నిశాఖల సమన్వయంతో సహాయ చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. మరోవైపు స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనపై కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ ఆరా తీశారు. గాయపడిన వారికి మెరుగైనటువంటి వైద్యాన్ని అందించాలని అధికారులకు ఆయన ఆదేశాలిచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో కార్మికులు మృతిచెందడం తీరని విషాదమని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.



## నేడు ఢిల్లీకి చంద్రబాబు, పవన్

**రేపు ఎన్డీఏ కీలక సమావేశం**

**అమరావతి, మహా** సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఢిల్లీ వెళ్ళనున్నారు. బుధవారం ఢిల్లీలో ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశం కేంద్ర ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొంటారు. త్వరలో జరగబోయే కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

# నేను పనులకు ఒప్పిస్తే.. కిషన్ రెడ్డి వెళ్ళి అడ్డుతగులుతున్నాడు

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పిస్తే, నిధులు, ప్రాజెక్టులు ఇస్తే కాంగ్రెస్‌కు, రేవంత్‌రెడ్డి పేరు వస్తుందని కిషన్‌రెడ్డి కర్ర అడ్డం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1674.74కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ముందుగా సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయ భవనం, మియాపూర్‌లో ద్విముఖ పైవంతెన, 2 అండర్‌పాస్‌లు, మియాపూర్ నుంచి ఆల్విన్ ఎక్స్ రోడ్ వరకు ఆరు వరుసల ద్విముఖ పైవంతెన, శేరిలింగంపల్లి రైల్వేస్టేషన్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మియాపూర్ లక్ష్మీనగర్‌లో బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. దేశంలో 6 పెద్ద నగరాలే దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఢిల్లీలో వాతావరణం ఎలా ఉందో చూశామని, కాలుష్యం వల్ల ఢిల్లీలో స్కూళ్లు, ప్రధాని కార్యాలయాన్నే మూసేశారని పేర్కొన్నారు. దేశంలోని అన్నీ ప్రధాన నగరాల్లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయన్న ఆయన హైదరాబాద్ మాత్రం నివాసానికి అనుకూల నగరమని కొనియాడారు. పెద్ద నగరాల్లో ఉన్న సమస్యలు ఇక్కడ లేకుండా చేసేందుకు నిపుణులతో కమిటీ వేశామని, పాలనా సమన్వయం కోసమే 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబరాబాద్ కార్పొరేషన్‌లో ఐటీ కంపెనీలు ఉన్నాయని, దేశ ఐటీ ఎగుమతుల్లో 16.77 శాతం హైదరాబాద్ నుంచే సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు.


**బీజేపీ ఎంపీలు తెలంగాణకు ఏం తెచ్చారు**

ఎన్నికలకు 6 నెలల ముందు రాజకీయం మాట్లాడుకుందామని, ఈ రెండేళ్లు అందరం కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ నుంచి 8 మంది ఎంపీలను పంపిస్తేనే మోదీ ప్రధానమంత్రి అయ్యారని అన్నారు. 8 మంది బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి ఏం తీసుకొచ్చారని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీలు గుజరాత్‌కు గులాంలా ఎందుకు పనిచేస్తున్నారని ఆయన నిలదీశారు. ఇక్కడ ఉన్న ప్రజలు మీకు ఓట్లు వేయలేదా? అని ప్రశ్నించారు. రెండేళ్లలో ఏం చేయలేదని తనను అడుగుతున్నారని ముందు మీరేం చేశారో చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు నీటి పారుదల ప్రాజెక్టు నిధులు రాకుండా అడ్డుపుల్ల పెట్టారని ధ్వజమెత్తారు. సబర్మతి, గంగా, యమున ప్రక్షాళన చేస్తే ఆహా ఓహో అంటున్న వీళ్లు మూసి ప్రక్షాళనకు సహకరించమని బీజేపీ ఎంపీలు అడగాలి కదా అని చెప్పారు.

## లక్ష ఇళ్ళు కడతాం

పదేళ్లు సీఎంగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు ఫామ్‌హౌస్‌లో పడుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 12 ఏళ్లుగా ప్రధాని మోదీ ఏం చేశారో రెండేళ్లు సీఎంగా తాను ఏం చేశానో చర్చకు సిద్ధమన్నారు. గాజులరామారంలో వంద ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్‌ను నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. విశ్వనగరంలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇళ్లు కట్టించి ప్రజలకు కేటాయిస్తామని, ఏ ప్రాంతం వారికి అక్కడే ఇల్లు కట్టించి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కబ్జా చేసిన ప్రభుత్వ భూములు గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఇప్పటి వరకు రూ.10 వేల కోట్లు చెల్లించామన్న ఆయన మహిళా సంఘాలకు వెయ్యి బస్సులు కొనిచ్చినట్లు తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ మహాలక్ష్మి పథకం వల్లే లాభాల్లోకి వచ్చిందన్నారు. కార్యక్రమాల్లో మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ యాదవ్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మల్ రెడ్డి రంగారెడ్డి, నవీన్ యాదవ్, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలో మళ్లీ క్షిపణి మోతలు



**ఢిల్లీ,మహా :** ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య గత కొన్ని రోజులుగా తాత్కాలికంగా కొనసాగిన నిశ్శబ్దం బద్దలైంది. ఇరు దేశాల మధ్య మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో పశ్చిమాసియా ప్రాంతం మరోసారి తీవ్ర అశాంతి, ఉద్రిక్తతల దిశగా సాగుతోంది. పరస్పర వైమానిక దాడులు, క్షిపణుల ప్రయోగాలతో సరిహద్దుల్లో పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారిన నేపథ్యంలో అంతర్జాతీయ సమాజంతో పాటు భారతదేశం సైతం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా ఉద్రిక్తతలను ఇరు పక్షాలు తక్షణమే తగ్గించుకోవాలని, శాంతి స్థాపన కోసం ప్రస్తుతం అంతర్జాతీయంగా జరుగుతున్న దౌత్య చర్చలను త్వరితగతిన పూర్తి చేసి సాధారణ స్థితిని తీసుకురావాలని అన్ని వర్గాలకు భారత్ పిలుపునిచ్చింది. పశ్చిమాసియాలో తిరిగి దాడులు ప్రారంభం కావడం అంతర్జాతీయ రక్షణ రంగానికి తీరని నష్టం కలిగించే విషయమని భారత విదేశాంగ శాఖ సోమవారం విడుదల చేసిన ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే వంద రోజులకు పైగా సుదీర్ఘంగా కొనసాగుతున్న ఈ ఘర్షణలు ఉభయ దేశాలలోనూ భారీ ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సుదీర్ఘ యుద్ధం వల్ల మానవతా సంక్షోభం మరింత తీవ్రరూపం దాల్చడమే కాకుండా.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సమతుల్యతతో పాటు అంతర్జాతీయ ఇంధన, చమురు సరఫరాలపై కూడా దీని ప్రభావం తీవ్రంగా పడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. అన్ని పక్షాలు తక్షణమే విచక్షణతో వ్యవహరించి ఉద్రిక్తతలను అదుపు చేయాలని, అమాయక పౌరులకు ఎలాంటి హాని జరగకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని భారత్ సూచించింది. యుద్ధం కంటే దౌత్యపరమైన సంప్రదింపుల ద్వారానే ఎలాంటి సమస్యకైనా శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొంటూ, పశ్చిమాసియాలో స్థిరత్వం కోసం జరుగుతున్న చర్చలు విజయవంతం కావాలని ఆకాంక్షించింది

## ఓటర్ల సవరణ పక్రియను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

**కారేపల్లి, మహా :** కారేపల్లి మండలంలో ప్రత్యేక ఓటర్ల సవరణ(సర్)ను జిల్లా అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) డాక్టర్ పీ. శ్రీజ సోమవారం తనిఖీ చేశారు. గాదెపాడు గ్రామంలో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగితెలుసుకున్నారు. ప్రత్యేక ఓటర్ల సవరణలో ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలించాలని బీఎల్‌వో, బీఎలఎ లకు సూచించారు. సర్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఆరఐ జగదీశ్, జీపీవో శ్రీనివాస్, సర్పంచ్ భూక్య రంజిత్‌కుమార్ తదితరులు ఉన్నారు.





## దివ్యాంగ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలి

**జిల్లాల్లో అప్లికేషన్లు వెంటనే ఓకే చేయాలి**
**మీడియా అకాడమీ చైర్మన్‌కు డీజేఎస్ మెమోరాండం**

**హైదరాబాద్, మహా :** దివ్యాంగులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ యాజమాన్యాల కోటాతో సంబంధం లేకుండా అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని మీడియా అకడామి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని డెస్క్ జర్నలిస్టుల సంఘం (డీజేఎస్) కోరింది. అలాగే కొన్ని జిల్లాల్లో డెస్క్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ దరకాస్తులను వెంటనే ఆమోదించి కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. సోమవారం డీజేఎస్ అధ్యక్షుడు బాదిని ఉపేందర్ ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర కార్యవర్గం, పలువురు డెస్క్ జర్నలిస్టులు ప్రెస్ అకాడమీ చైర్మన్‌ను కలిసి డెస్క్ జర్నలిస్టు సమస్యలపై మోమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన జర్నలిస్టులకు యాజమాన్యాల కోటాతో సంబంధం లేకుండా ఆక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. అలాగే జిల్లాల్లో డెస్క్ జర్నలిస్టులు చేసుకున్న దరఖాస్తులను ఆమోదించడంలో డీపీఆర్వోలు ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. అలాగే ప్రతి జిల్లాల్లో డెస్క్ జర్నలిస్టులకు జిల్లా కేంద్రంగా అదనంగా అక్రెడిటేషన్లు కేటాయిస్తూ జారీ చేసిన జీవోను అమలు చేయడంలో నెలకొన్న నిర్లక్ష్యాన్ని దృష్టికి తీసుకెళ్లారు. 15 ఏండ్ల ఎక్స్‌పీరియన్స్ దాటిన డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. డీజేఎస్ చేసిన వినతులపై సానుకూలంగా స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి దివ్యాంగులైన వర్కింగ్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల జారీ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. జిల్లాల్లో అక్రెడిటేషన్ల ప్రక్రియలో నెలకొన్న ఆలస్యం, జీవో అమలులో నిర్లక్ష్యంలో ఐఅండ్ పీఆర్ అధికారులతో చర్చిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీజేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవన్ రాజారామ్, కనపర్తి రమేశ్, గుజ్జుల సత్యప్రసాద్. వి, వెంకటరమణ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

**వినతులు అందజేద్దాం**

మంగళవారం హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లో ఉన్న ఐఅండ్ పీఆర్ కమిషనరేట్లో జరిగే రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ మీటింగ్ కు హాజరయ్యే సభ్యులకు అక్రెడిటేషన్ కార్డులు రాని వారంతా కలిసి ఓ వినతి పత్రం అందజేద్దామని డీజేఎస్ ప్రెసిడెంట్ ఉపేందర్ పిలుపునిచ్చారు. అందుబాటులో ఉన్న మిత్రులు మంగళవారం ఉదయం ఐఅండ్ పీఆర్ కమిషనరేట్ వద్దకు రావాలని కోరారు.

## కాంగ్రెస్‌ది హిట్లర్ మనస్తత్వం



**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ధ్వజం.**

**హైదరాబాద్, మహా :** రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం నమ్మకం లేదని, ఆ పార్టీ మనస్తత్వమే హిట్లర్ మనస్తత్వమని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనాడు ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించగా, నేడు కూడా కాంగ్రెస్ పార్టీ నియంతృత్వ ధోరణితో ఒకే కుటుంబం చుట్టూ తిరుగుతోందని విమర్శించారు. హిట్లర్ తరహా ఆలోచనలతో నడిచే ఏ రాజకీయ పార్టీ అయినా చివరికి ప్రజల తిరస్కారాన్నే ఎదుర్కొంటుందని, అందుకే ప్రస్తుతం దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల సంఖ్య వేళ్లతో లెక్కించదగ్గ స్థాయికి పడిపోయిందని ఎద్దేవా చేశారు.

*రాష్ట్రపతి, ప్రధానిని కించపరచడం దారుణం*

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ నాయకత్వంపై వ్యవహరిస్తున్న తీరు అత్యంత బాధాకరమని రాంచందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఓబీసీ వర్గానికి చెందిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గిరిజన మహిళ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ములకు గౌరవం ఇవ్వడానికి ఇబ్బంది పడుతూ, కాంగ్రెస్ కుటుంబానికి మాత్రం రేవంత్ విధేయత చూపడం ఆయన సంకుచిత ఆలోచనా విధానాన్ని బయట పెడుతోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం బీజేపీ జపం చేస్తున్నారని, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌ల పేర్లు తప్ప ఆయనకు మరో అంశమే దొరకడం లేదన్నారు. ప్రధాని మోదీ సభ విజయవంతం కావడంతో తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ వేగంగా బలపడుతోందనే భయం, అసహనం కాంగ్రెస్ నాయకత్వంలో స్పష్టంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు.

*ధాన్యం కొనుగోళ్లలో అబద్ధాల వేట*

ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పచ్చి అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని రాంచందర్‌రావు గణాంకాలతో సహా నిలదీశారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) వివరాల ప్రకారం.. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం సేకరించిన 104.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో ఒక్క తెలంగాణ నుంచే ఏకంగా 55.31 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించబడిందని స్పష్టం చేశారు. అంటే దేశవ్యాప్త సేకరణలో సగానికి పైగా తెలంగాణ నుంచే జరిగిందన్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కింద దేశంలో రైతులకు చెల్లించిన రూ.21,243 కోట్లలో తెలంగాణ రైతులకే అత్యధికంగా రూ.13,171 కోట్లకు పైగా చెల్లింపులు జరిగాయని, లబ్ధి పొందిన 11.69 లక్షల మంది రైతుల్లో 7,79,358 మంది మన రాష్ట్ర రైతులేనని వివరించారు. మార్చి 25 నుంచే ప్రారంభం కావాల్సిన కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 25 వరకు ప్రారంభించకుండా నెల రోజుల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం నిద్రపోయిందని, బీజేపీ పోరాటాల తర్వాతే ప్రభుత్వం మేల్కొందని మండిపడ్డారు. రాబోయే పంట సీజన్‌లోనైనా రైతుల దగ్గరకు వెళ్లి ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**అపాయింట్‌మెంట్ అబద్ధాలు.. మెట్రో నిధుల దాపరికం**

మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు ముమ్మాటికీ అవాస్తవమని రాంచందర్‌రావు కొట్టిపారేశారు. తాను స్వయంగా ఫడ్నవీస్ కార్యాలయానికి ఫోన్ చేసి విచారించానని, తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) నుంచి ఎలాంటి అధికారిక అభ్యర్థన రాలేదని వారు స్పష్టం చేశారని తెలిపారు. సీఎం చేయాల్సిన పనులను కూడా కేంద్రమంత్రి కిషన్ రెడ్డే చేయాలనడం హాస్యాస్పదమన్నారు. హైదరాబాద్ మెట్రో పురోగతిలో కేంద్ర ప్రభుత్వ పాత్రను రేవంత్ సర్కార్ పూర్తిగా దాచిపెడుతోందని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ చేతుల మీదుగానే మెట్రోకు శంకుస్థాపన జరిగిందని, ఆర్థిక సహాయం, విధానపరమైన అనుమతులు ప్రతి దశలోనూ కేంద్రం అందించిందని గుర్తుచేశారు. మెట్రోను ఫలక్‌నుమాకు, మేడ్చల్ వైపు విస్తరించడంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలస్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే కేంద్రంపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) భూసేకరణకు కేంద్రం నిధులు ఇచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాను ఎందుకు విడుదల చేయడం లేదని నిలదీశారు.

**ప్రాజెక్టులు మరో ఏటీఎంగా మారాయి**

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును తమ స్వంత ఏటీఎంగా మార్చుకున్నట్లే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును మరో ఏటీఎంగా మార్చే ప్రయత్నం చేస్తోందని, కమిషన్ల కోసమే ప్రాజెక్టులు నడుస్తున్నాయనే అనుమానాలు ప్రజల్లో బలంగా ఉన్నాయని ఆరోపించారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు రావాల్సిన నీటిని ఇతర రాష్ట్రాలకు మళ్లిస్తుంటే ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని, అయితే నిర్వాసితులకు సరైన న్యాయం చేయకుండా, డీపీఆర్ లేకుండా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం ఆమోదయోగ్యం కాదన్నారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన వరంగల్ రైతు డిక్లరేషన్, చేవెళ్ల, కామారెడ్డి, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్లను కాంగ్రెస్ పూర్తిగా విస్మరించి "డిక్లేర్ అండ్ ఫర్గెట్" (ప్రకటించడంమరచిపోవడం) విధానాన్ని అవలంబిస్తోందని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. "జిత్నా కీచడ్ ఉఛాలోగే, ఉత్నా కమల్ ఖిలేగా" (మీరు ఎంత బురద జల్లితే అంతగా కమలం వికసిస్తుంది) అని పేర్కొంటూ, బీజేపీపై ఎంత తప్పుడు ప్రచారం చేసినా ప్రజా మద్దతుతో పార్టీ మరింత బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఇకనైనా వ్యక్తిగత దూషణలు మాని, రైతు భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి వంటి ఎన్నికల గ్యారెంటీల అమలుపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

# నవ శకానికి నాంది

- **రాజకీయాలకు అతీతంగా మహానగర సమగ్రాభివృద్ధి.**
- **రూ. 1,674 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.**



**హైదరాబాద్, మహా :** రాష్ట్ర అభివృద్ధే ఏకైక ఎజెండాగా, వచ్చే రెండున్నరేళ్లు నిరంతరం తెలంగాణ వికాసం కోసం అహర్నిశలు శ్రమిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయాలకు అతీతంగా, ఎలాంటి వివక్షకు తావులేకుండా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే పూర్తి బాధ్యతను తాను స్వయంగా తీసుకుంటానని స్పష్టం చేశారు. దేశంలోని ఇతర మహానగరాలు ఎదుర్కొంటున్న కాలుష్యం, ట్రాఫిక్, వరదల వంటి తీవ్రమైన సమస్యలను ముందుగానే పసిగట్టి, శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరాన్ని పక్కా ప్రణాళికతో, భవిష్యత్ దార్శనికతతో (విజన్) తీర్చిదిద్దుతామని ఆయన ప్రకటించారు. మియాపూర్ క్రాస్ రోడ్స్ వద్ద ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నూతన భవన నిర్మాణంతో పాటు, మొత్తం రూ. 1,674.74 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు కీలక అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నగర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వ కార్యాచరణను సవివరంగా ప్రజల ముందుంచారు. కేవలం హైదరాబాద్‌ను 'విశ్వనగరం' అని మాటల్లో చెబితే సరిపోదని, ఆ స్థాయికి తగ్గట్లుగా క్షేత్రస్థాయిలో అద్భుతమైన ప్రణాళికలు అమలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగానే మల్కాజిగిరి పరిధిలోని గాజుల రామారంలో ఏకంగా వంద ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్‌ను నిర్మించనున్నట్లు ఒక కీలక ప్రకటన చేశారు. దీనికి సంబంధించిన పనులను రానున్న మూడు నెలల్లోనే యుద్ధప్రాతిపదికన ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. అలాగే నగర రవాణా ముఖచిత్రాన్ని మార్చేలా రాయదుర్గం నుంచి నియోపోలీస్ వరకు మెట్రో రైలు మార్గాన్ని విస్తరించే పనులను సైతం త్వరలోనే చేపడతామని వెల్లడించారు. వీటికి తోడు మూసీ నది సమగ్ర ప్రక్షాళన, తెలంగాణ రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్), రేడియల్ రోడ్ల నిర్మాణం వంటి బృహత్తర ప్రాజెక్టులను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లకు అత్యంత ఆధునిక సదుపాయాలతో కూడిన అద్భుతమైన పరిపాలనా భవనాలను నిర్మిస్తామని ముఖ్యమంత్రి ప్రజలకు హామీ ఇచ్చారు.

హైదరాబాద్ నగరపాలక వ్యవస్థలో ఒక చారిత్రక ఘట్టంగా నిలిచే పరిపాలనా వికేంద్రీకరణ వెనుక ఉన్న ఆంతర్యాన్ని ముఖ్యమంత్రి సోదాహరణంగా వివరించారు. ప్రస్తుతం అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి ప్రాంతంలోనే ఏకంగా 1.34 కోట్ల జనాభా నివసిస్తున్నారని, దేశ విదేశాల నుంచి ఉపాధి కోసం లక్షలాది మంది నిత్యం నగరానికి వస్తుండటంతో ఏటా 3 శాతం వృద్ధి చెందుతోందని ఆయన గుర్తుచేశారు. ఇంతటి భారీ జనాభా ఉన్న ఈ విశాల ప్రాంతంలో ఇన్నాళ్లూ గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రేటర్ హైదరాబాద్ అని నాలుగు రకాల పాలనా వ్యవస్థలు ఉండటం వల్ల తీవ్ర గందరగోళం నెలకొనేదన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య కనీస సమన్వయం లోపించి రోడ్లు, తాగునీరు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, చెత్త నిర్మూలన లాంటి కనీస అవసరాలు కూడా తీరక ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దయనీయ పరిస్థితిని శాశ్వతంగా చక్కదిద్దేందుకే నిపుణులతో సుదీర్ఘంగా సమాలోచనలు జరిపామన్నారు. అందులో భాగంగానే 2,100 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న మహానగరాన్ని మూడు వేర్వేరు మున్సిపల్ కార్పొరేషన్లుగా అనగా 150 డివిజన్లతో జీహెచ్ఎంసీ, 76 డివిజన్లతో సైబరాబాద్, 74 డివిజన్లతో మల్కాజిగిరి కార్పొరేషన్లుగా విడదీసినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. పాలనా సౌలభ్యం కోసమే ఈ వికేంద్రీకరణ జరిగిందని, దీనికి అనుగుణంగానే పోలీస్ కమిషనరేట్ల పరిధులను సైతం హేతుబద్ధీకరించి ఏర్పాటు చేశామని వివరించారు. దేశంలోని ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై నగరాలు ఎదుర్కొంటున్న దుస్థితి నుంచి గుణపాఠాలు నేర్చుకుని ముందుచూపుతో ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో సొంతింటి కల కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పేద, మధ్యతరగతి వర్గాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీపికబురు అందించారు. నగర వ్యాప్తంగా నిరుపేదలు ఎక్కడెక్కడైతే నివాసం ఉంటున్నారో, వారందరికీ వీలైనంత వరకు అదే ప్రాంతంలో ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ప్రకటించారు. ఇందుకోసం ఏకంగా లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ ఇళ్లను నిర్మించి అర్హులకు పంపిణీ చేయబోతున్నామని, ఇళ్ల నిర్మాణానికి అనువైన ప్రభుత్వ



భూములను ఇప్పటికే ముమ్మరంగా గుర్తిస్తున్నామని స్పష్టం చేశారు. అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వానికి ఎలాంటి రాజకీయ వివక్షగానీ, వితండవాదంగానీ లేదని ఆయన తేల్చిచెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉండాలని, మరో ఆరు నెలల్లో ఎన్నికలు అనగా అప్పుడు రాజకీయాల గురించి మాట్లాడుకుందామని ఆయన సూచించారు. అప్పటివరకు ప్రతిపక్షాలతో సహా అన్ని రాజకీయ పక్షాలు తమ విజ్ఞతను ప్రదర్శించి రాష్ట్ర, నగర అభివృద్ధికి సంపూర్ణంగా సహకరించాలని ముఖ్యమంత్రి బహిరంగంగా పిలుపునిచ్చారు.

మియాపూర్ క్రాస్ రోడ్స్ వద్ద అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ బృహత్తర కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ, మల్‌రెడ్డి రంగారెడ్డి, సీనియర్ నాయకులు నవీన్ యాదవ్ తదితరులతో పాటు భారీ సంఖ్యలో ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు ఈ సభకు హాజరయ్యారు.

## కేంద్రంపై 'ఇండియా' కదనభేరి


**ఢిల్లీ,మహా :** జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ విధానాలపై రాజీలేని పోరాటం చేసేందుకు విపక్షాల ఐక్య వేదిక 'ఇండియా కూటమి' కదనభేరి మోగించింది. సోమవారం ఢిల్లీలో 23 ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులతో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఎన్డీఏ సర్కారుపై ముకుమ్మడి దాడికి వ్యూహరచన చేశారు. ముఖ్యంగా దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ ప్రశ్నపత్రాల లీకేజీ, సీబీఎస్ఈ వివాదాలపై విపక్ష నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ వ్యవహారంలో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కూటమి పక్షాలు ఏకగ్రీవంగా డిమాండ్ చేశాయి. రాబోయే వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో ఇండియా కూటమి పక్షాలన్నీ ఐక్యంగా వ్యవహరించి, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ముక్తకంఠంతో నిలదీయాలని ఈ భేటీలో నిర్ణయించారు.

**తదుపరి భేటీ హైదరాబాద్‌లోనే**

ఈ సమావేశంలో ప్రధానంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో జరిగిన అవకతవకలు, ఓట్ల గల్లంతుపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి నేరుగా లేఖ రాయాలని తీర్మానించారు. అలాగే, దేశంలో నానాటికీ దిగజారుతున్న ఆర్థిక పరిస్థితి, పెరిగిపోతున్న నిరుద్యోగం, తదితర





జాతీయ సమస్యలపై తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తు కార్యాచరణను ఎప్పటికప్పుడు సమీక్షించుకునేందుకు వీలుగా ఇకపై ప్రతి రెండు నెలలకోసారి కూటమి పక్షాలు సమావేశం కావాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఇండియా కూటమి తదుపరి భేటీని ఆగస్టు నెలలో హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్నట్లు నేతలు అధికారికంగా ప్రకటించారు. సమావేశం ఆసాంతం జాతీయ సమస్యలపై చర్చ సాగినప్పటికీ, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 23పార్టీలు ఈభేటీకి హాజరయ్యాయి. వామపక్షాలు సీపీఐ, సీపీఎం కూడా పాల్గొన్నాయి. సోనియా, ఖర్గే, రాహుల్, మమత, అఖిలేష్, తేజస్వీ, సుప్రియా.,ఒమర్ అబ్దుల్లా వంటి నేతలంతా హాజరయ్యారు.



## ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రలో రష్మిక

**మహా :** భారతదేశం గర్వించే ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసురాలు, భారతరత్న ఎమ్మెస్ సుబ్బులక్ష్మి జీవిత కథ ఆధారంగా ఓ భారీ బయోపిక్ రాబోతున్న సంగతి తెలిసిందే. జాతీయ అవార్డు గ్రహీత, 'జెర్సీ' చిత్ర దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ప్రధాన పాత్ర పోషించేది ఎవరనే దానిపై నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడినట్లు తెలుస్తోంది. ఈ అరుదైన అవకాశం 'నేషనల్ క్రష్' రష్మిక మందన్నను వరించినట్లు సమాచారం. ఇటీవల చిత్రబృందం రష్మికపై రహస్యంగా ఒక లుక్ టెస్ట్ నిర్వహించింది. సాంప్రదాయ గెటప్‌లో రష్మిక అద్భుతంగా సరిపోయిందని, ఆమె హావభావాలు చూసి దర్శకుడు గౌతమ్ తిన్ననూరి పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని తెలుస్తోంది. దీంతో ఈ పాత్రకు ఆమెను దాదాపు ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది.



## పలకరించిన వాన.

**రాష్ట్రంలో దంచికొడుతున్న వానలు.**

**హైదరాబాద్:మహా :** తెలంగాణ వ్యాప్తంగా రుతుపవనాల ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గత రాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ, కేంద్ర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వరుణుడు తన ప్రతాపం చూపించడంతో రాత్రి వేళల్లో కుంభవృష్టి కురిసింది. తెలంగాణ ప్రణాళికా సంఘం (టీజీడీపీఎస్) విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మట్టంపల్లిలో అత్యధికంగా 112 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా కందుకూరులో 87.8 మి.మీ., నల్గొండ జిల్లా దామరచర్లలో 73.5 మి.మీ., రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 73.3 మి.మీ. చొప్పున వర్షం కురిసింది. అదే విధంగా ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో 57 మి.మీ., నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లిలో 41.8 మి.మీ., ములుగు జిల్లా మల్లంపల్లిలో 38.8 మి.మీ., నిజామాబాద్ జిల్లా సిరికొండలో 38 మి.మీ., సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో 32.5 మి.మీ., సిరిసిల్ల జిల్లా వేములవాడలో 32 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

**తెలంగాణను ముంచెత్తిన ఉరుముల తుఫాను**

రాష్ట్రంలోని ఆగ్నేయ ప్రాంతాలైన రంగారెడ్డి, నల్గొండ, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలను రాత్రి వేళల్లో భారీ ఉరుముల తుఫాను వణికించింది. తెల్లవారుజామున సైతం సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, సిరిసిల్ల, కామారెడ్డి, పెద్దపల్లి, కరీంనగర్, హన్మకొండ, భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాల్లో విస్తృతంగా జల్లులు కురిశాయి. ఆ తర్వాత మధ్యాహ్నం వేళకు వాతావరణం మరింత వేడెక్కి, రంగారెడ్డి జిల్లా పరిధిలోని షాద్‌నగర్, చేవెళ్ల, శంకర్ పల్లి, యాచారం ప్రాంతాలతో పాటు నల్గొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఉరుములతో కూడిన తీవ్రమైన వర్షాలు పడ్డాయి. సాయంత్రం 4 గంటల సమయానికి ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి మేఘావృతమై తీవ్రమైన వానలు కురిశాయి. ఇదే సమయంలో రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ చెల్లాచెదురుగా వర్షాలు పడ్డాయి.

## వీరాభిమాని కోరికను తీర్చిన సీఎం చంద్రబాబు

- **ఆచంట వృద్ధుడి వీడియోపై స్పందించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి.**
- **సిద్ధాంతం' సభ ముగిశాక ప్రత్యేకంగా తన బస్సులోకి పిలిపించుకుని ఆత్మీయ సంభాషణ.**
- **అభిమాని కుమారుడికి ఉచిత వైద్యం..**
- **ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు సీఎం ఆదేశం.**

**సిద్ధాంతం,మహా :** పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతం వేదికగా సోమవారం జరిగిన 'మీ భూమి మీ హక్కు' బహిరంగ సభ ఒక వీరాభిమాని జీవితంలో మరచిపోలేని మధుర అనుభూతిని మిగిల్చింది. తనను కలవాలన్న ఆచంటకు చెందిన వృద్ధుడు, వీరాభిమాని సత్యనారాయణ కోరికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత ఆత్మీయంగా నెరవేర్చారు. గతంలో సత్యనారాయణకు సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా, దానిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి.. పశ్చిమ గోదావరి జిల్లా పర్యటనలో భాగంగా 'సిద్ధాంతం' వేదికపై కలుద్దామని అప్పట్లోనే హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సభ ముగిసిన వెంటనే చంద్రబాబు తన మాటను నిలబెట్టుకుంటూ సత్యనారాయణను ప్రత్యేకంగా తన పర్యటన బస్సులోకి పిలిపించుకున్నారు.

ఆచంట నుంచి వచ్చిన తన వీరాభిమానితో ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా సేపు ఆత్మీయంగా ముచ్చటించారు. వృద్ధుడి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ.. ఆయన ప్రస్తుత ఆరోగ్యం, కుటుంబ ఆర్థిక పరిస్థితులపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ తన ఇంట్లోని బాధను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమారుడికి అవసరమైన వైద్యసాయం అందించి ఆదుకోవాలని, అలాగే తమ గ్రామానికి డ్రైనేజీ సదుపాయం కల్పించి సమస్యను పరిష్కరించాలని ఆయన సీఎంను చేతులు జోడించి వేడుకున్నారు.

అభిమాని విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే స్పందించారు. సత్యనారాయణ కుమారుడికి ప్రభుత్వపరంగా మెరుగైన వైద్యం చేయిస్తామని, ఆ బాధ్యత తనదని కొండంత భరోసా ఇచ్చారు. అంతేకాకుండా, సత్యనారాయణ కుటుంబ పరిస్థితిని గమనించి ఆయనకు తక్షణమే ఒక పక్కా గృహాన్ని నిర్మించి ఇవ్వాల్సిందిగా వేదికపైనే ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఇచ్చిన మాట ప్రకారం తనను పిలిచి మాట్లాడటమే కాకుండా, తన కుటుంబ కష్టాలను తీరుస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం పట్ల సత్యనారాయణ ఆనందబాష్పాలతో కృతజ్ఞతలు నివేదించారు. ఈ ఆత్మీయ కలయిక సభా ప్రాంగణానికి తరలివచ్చిన జనసందోహాన్ని ఎంతగానో ఆకట్టుకుంది.



# బతుకు పై బండ




కడుపు మాడుతున్నా బయట టిఫిన్ తినలేం. హాస్టల్ లో ఉండలేం... హోటల్ కు అసలే పోలేం. లాడ్జి రూంలో బస చేయలేం... అంతే కాదు. ఇప్పుడు వంటింట్లోకి వెళ్లి గ్యాస్ స్టవ్ వెలిగించాలన్నా ఒకటికి పది సార్లు ఆలోచించాల్సి వస్తోంది. ఇప్పుడు ప్రతీ ఒక్కరు ఎదురుకుంటున్న సమస్య ఇదే. అమెరికా తెచ్చి పెట్టిన తంటా ఇది. అమెరికా, ఇరాన్ యుద్ధం ఏమో కానీ దేశంలో ఇప్పుడు సామాన్య జనం మాత్రం జీవించేందుకు నిత్య జీవన సమరం చేయాల్సిన పరిస్థితి వచ్చి పడింది. వంటగ్యాస్ ధరలు భగ్గుమంటున్నాయి. చూస్తుండగా ఈ మధ్య కాలం అటు ఇటుగా ఒక్క సిలిండర్ పై 90 రూపాయలు పెరిగిపోయింది. ఇదే ఇప్పుడు పేద, మధ్య వర్గ ప్రజలను ఉక్కిరి, బిక్కిరి చేస్తోంది. ఇప్పటికే కర్షియల్ సిలిండర్ రేట్స్ ఆకాశాన్ని అంటుతున్నాయి. దీనికి తోడు సప్లై కొరత భారీగానే వుంది... ఫలితంగా బజారు బండ్లు కనుమరుగయ్యే దుస్థితి వచ్చింది. ఇక కాస్త అటు, ఇటుగా వున్న హోటల్స్ లో టిఫిన్ రేట్స్ చూస్తేనే కళ్ళు బైర్లు కమ్ముకుంటున్నాయి... దోశ, పూరి, మైసూరు బజ్జి, మిర్చి బజ్జి ల రేట్లు పేట్ కు పది నుంచి 20 రూపాయలు పెరిగి పోయాయి... బండి మీద ఇడ్లీలు గతంలో నాలుగు ఇచ్చే వారు... ఇప్పుడు మూడుకు పడి పోయింది.. రేట్స్ కూడా అయిదు రూపాయలు పెరిగి పోయాయి. చిరు వ్యాపారులు బతకలేని పరిస్థితి వచ్చింది. టీ, కాఫీ తాగలేక అవస్థలుపడుతున్నారు జనాలు. ఏది తిందామన్నా, తాగుదామన్నా జేబులో చేతులు పెట్టుకొని డబ్బులు లెక్కలు వేసుకోవల్సిందే.. ఇక పెరిగిన గ్యాస్ ధరలతో పాటు పెట్రోల్, డీజిల్ కొరత తో ఒక్కసారిగా నిత్యవసర వస్తువుల ధరలు కూడా ఇప్పుడు చుర్రు మంటున్నాయి. పాల రేట్స్ లీటర్ పై రెండు రూపాయలు పెరిగి సామాన్య జనాలు టీ, కాఫీ తాగాలి అన్నా ఆలోచించుకోవాలి అనేలా చేసాయి. తెల్లవారింది మొదలు రాత్రి పడుకునే వరకు ధరల మోత ప్రజల జేబులపై దాడి చేస్తూనే వున్నాయి.

ఇప్పుడు వంటగ్యాస్ సిలిండర్ రేట్ ను కేంద్రం 29 రూపాయలు పెంచింది. దీంతో ఈ మధ్య కాలం సిలిండర్ పై పెరిగిన రేట్ 89 రూపాయలకు చేరుకుంది. ఇది ఇక్కడితో ఆగుతుందా అంటే దానికి సమాధానం చెప్పటం అత్యంత కష్టం. ఇప్పటికి ఇప్పుడు పశ్చిమ ఆసియా యుద్ధం ఆగినా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు మాత్రం వెంటనే తగ్గే అవకాశం ఎంత మాత్రం లేదు..అమెరికా కరుణ, కటాక్షం పై ఇప్పుడు జనాల భవిష్యత్ ఆధార పడింది. పశ్చిమ ఆసియా యుద్ధం వల్ల భారతదేశానికి వచ్చిన ఇబ్బంది ఏమి లేదంటూ ఇంత వరకు చెప్పుకుంటూ వచ్చిన కేంద్రం పెద్దలు ఇప్పుడు నోరు మెదపటం లేదు.. ధరలు పెరిగినంత వేగంగా ప్రజల జీతం, భత్యం పెరగదు కదా... ఇప్పుడు ఈ ధరల మోత సామాన్య ప్రజల నెత్తిన పిడుగు పాటు అయింది. పల్లెలు మొదలుకుని ఇప్పుడు నగరాల వరకు వంట గ్యాస్ నిత్యవసరంగా మారింది... పొగ కష్టాల నుంచి మహిళలకు విముక్తి అంటూ ఇంటింటికి గ్యాస్ అందించిన పాలకులు భవిష్యత్ లో వచ్చే ఇబ్బంది మాత్రం గుర్తించలేక పోయారు. ఇక వంట గ్యాస్ సిలిండర్ల కొరత కూడా సామాన్య ప్రజలను కలవర పెడుతూనే వుంది... గ్యాస్ బుక్ చేసిన పది, పదిహేను రోజుల వరకు సిలిండర్ ఇంటికి చేరటం లేదు.. దింతో గ్రామాల్లో మళ్ళీ కట్టెల పొయ్యి వైపు మహిళలు దృష్టి పెట్టారు... నగరాలు, పట్టణాల్లో కట్టెల పొయ్యి పెట్టుకునే పరిస్థితి లేదు.. దింతో ఎలక్ట్రికల్ కుక్కర్లను జనం ఇంటికి తెచ్చుకుంటున్నారు... ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ముందు ఎలా ఉంటుంది... ఇదే ఇప్పుడు సామాన్య జనానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది... ఓ సాధారణ కుటుంబం హైదరాబాద్ వంటి నగరాల్లో జీవనం సాగించాలి అంటే నెల సరి 50 వేల వరకు ఖర్చు తప్పనిసరిగా ఉంటుంది... ఇంటి అద్దె... కరెంట్ బిల్లు, వాటర్ బిల్లు, నెల సరి సరుకులు, పాలు, గ్యాస్... పిల్లల ఫీజులు... రోజు వారీ కూరగాయలు, ఇంటి ఖర్చులు... ఇలా చెప్పు కుంటూ పోతే భార్య, భర్త, ఇద్దరు పిల్లలు వున్న కుటుంబానికి నెలకు వేలు ఏ మూలకు సరి పోవు... భార్య, భర్త ఇద్దరు సంపాదించినా నెల చివరిలో చేబదుళ్లు తప్పనిసరి అవుతున్నాయి..

ఇప్పుడు ప్రజల పై ధరలు ముప్పేటదాడి చేస్తున్నాయి.. నిత్యవసర వస్తువుల ధరలు పెరగటమే తప్పా ఎప్పుడు తగ్గిన దాఖలాలు లేవు... పది రూపాయలు పెట్టనిదే కరేపాకు, కొత్తిమిర కట్టలు కూడా రావట్లేదు. దీంతో సామాన్య జీవులకు రోజులు గడవటం గగనంగా మారిపోతోంది... ఇక ఇప్పుడు నిరుద్యోగ యువతకు, చిరు ఉద్యోగాలు చేసుకునే వారికి గడ్డు పరిస్థితి వచ్చింది... హాస్టల్స్ రేట్స్ ఒక్కసారిగా పెంచేశారు... హైదరాబాద్ వంటి నగరాల్లో ఓ మోస్తరు హాస్టల్ లో ఉండాలి అంటే ఏడున్నర వేలు చెల్లించాలి... ఇక ఇందులో కూడా ఇప్పుడు టీ, టిఫిన్ లిమిట్ పెట్టేసారు... ఓ వైపు ఇప్పుడే తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తోంది. ఈ ఉద్యోగాల కోసం వివిధ ప్రాంతాల నుంచి నిరుద్యోగులు హైదరాబాద్ కు వస్తున్నారు. ఇప్పుడు ఒక్కసారిగా పెరిగిన హాస్టల్ చార్జీలు వారికి మోయలేని భారం అవుతున్నాయి... సామాన్య జనం పై ఇప్పుడు గ్యాస్ ధరల బండ కూడా పడింది. దిన సరి ఖర్చుల్లో ఏది తగ్గించుకోవాలో, పెరుగుతూ పోతున్న ఈ ధరల మధ్య కుటుంబ పోషణ ఎలా సాగించాలో తెలియక సామాన్య జనం అవస్థలుపడుతున్నారు. కష్టాలు అన్నీ ఒకే సారి వచ్చి పడతాయని అంటారు. ఇప్పుడు అదే జరుగుతోంది... ఏ వస్తువు రేట్ ఎప్పుడు పెరుగుతుందో తెలీట్లేదు. ఇప్పుడు స్కూల్స్ కూడా తెరిచే సమయం ఆసన్నమైంది... పిల్లల ఫీజులు, డ్రెస్ లు, పుస్తకాలు... ఇలా తడిసి మోపెడు ఖర్చులు సామాన్య జనం గుండెలు జల్లు మనిపిస్తున్నాయి... అసలు పశ్చిమ ఆసియా యుద్ధ ప్రభావం మన దేశం మీద ఉండదే ఉండదు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ కు డోకా లేదు... ప్రజలు ఎలాంటి ఆందోళన పడొద్దు... వదంతులు నమ్మొద్దు... అంటూ సుద్దులు చెప్పిన పెద్దలు ఇప్పుడు ఏం సమాధానం చెబుతారు... సామాన్యుడు ఇప్పుడు ధరల ఉచ్చులో చిక్కుకుని విలవిలలాడుతున్నాడు. ఈ ఊబి నుంచి జనం బయట పడే మార్గమేది? ప్రభుత్వాలు ఇప్పుడు ఏం చేయబోతున్నాయి? జనాలపై పడిన బండ భారం ఎలా తప్పించే ప్రయత్నం చేస్తాయి. సామాన్యుడికి ఈ ధరల నుంచి విముక్తి ఎప్పుడు.? ఇవే ఇప్పుడు కేంద్రం, రాష్ట్రాలు తేల్చాల్సిన అంశాలు... లేకపోతే సామాన్యుల పరిస్థితి ధరల రోకలి పోటుకు నలిగి పోతుంది.



జీ. వెంకటరమణ
సీనియర్ జర్నలిస్ట్



# ప్రగతి శిఖరాగ్రాన వికసిత్ భారత్

అవినీతి పంకిలంలో కూరుకుపోయి, విధానపరమైన పక్షవాతంతో కునారిల్లిన జాతి, నేడు ప్రపంచ యవనిక పై సగర్వంగా, సమున్నతంగా తలెత్తుకుని నిలబడింది. సరిగ్గా పన్నెండేళ్ల క్రితం ఒక సామాన్య నేపథ్యం నుంచి వచ్చిన క్రాంతిదర్శి నరేంద్ర మోదీ ప్రధానిగా పగ్గాలు చేపట్టేనాటికి దేశం ముందు ఎన్నో పెను సవాళ్లు. కానీ, దశాబ్దానికి పైగా సాగిన ఆ అవిశ్రాంత ప్రయాణం నేడు భారత మాతను 'గ్లోబల్ లీడర్'గా నిలబెట్టింది. పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ కలలుగన్న 'అంత్యోదయ' స్ఫూర్తిని రగుల్చుతూ, బడుగు, బలహీన వర్గాల కన్నీరు తుడవడమే ఏకైక లక్ష్యంగా ఎన్డీయే సర్కారు సాగించిన ఈ సుపరిపాలన భారతీయ చరిత్రలో అక్షరాలా ఒక స్వర్ణయుగం.

గత పన్నెండేళ్లలో ఎన్ని అంతర్జాతీయ సంక్షోభాలెదురైనా, ప్రపంచ అగ్రరాజ్యాల ఆర్థిక వ్యవస్థలు సైతం మాంద్యపు కోరల్లో చిక్కుకుని వణికిపోయినా.. భారత ఆర్థిక పునాదులు ఏమాత్రం చెక్కుచెదరలేదు. ఒకప్పుడు విదేశీ సాయం కోసం అర్థిస్తూ ఎదురుచూసిన దీనస్థితి నుంచి, నేడు ఆయా దేశాలకు ఆర్థిక దిశానిర్దేశం చేసే మహోన్నత స్థాయికి మనం ఎదిగాం. ఆర్థిక ప్రగతిలో అగ్రశ్రేణికి పరుగులు తీస్తూ, 2026 నాటికి భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) ఏకంగా 4.15 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఐఎంఎఫ్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్ (4.26 ట్రిలియన్ డాలర్లు) తో అత్యంత తీవ్రంగా పోటీ పడుతూ ప్రపంచ ఆర్థిక శక్తుల సరసన భారత్ సగర్వంగా నిలబడనుంది.

పేదరిక నిర్మూలనలోనూ ప్రభుత్వం సాధించిన చారిత్రక విజయం యావత్ ప్రపంచాన్ని అబ్బురపరుస్తోంది. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం, 2011 నుంచి 2023 మధ్య కాలంలో ఏకంగా 17.1 కోట్ల మంది భారతీయులు తీవ్రమైన పేదరికం నుంచి శాశ్వతంగా విముక్తి పొందారు. దారిద్ర్య రేఖ దిగువన మగ్గుతున్న వారి శాతం 16.2 నుంచి కేవలం 2.3 శాతానికి పడిపోవడం దరిద్ర నారాయణుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న అచంచలమైన చిత్తశుద్ధికి నిలువెత్తు దర్పణం.

అవినీతి రహిత పాలనకు, పారదర్శకతకు జన్‌ధన్ యోజన అక్షరాలా ఒక బ్రహ్మాస్త్రంలా పరిణమించింది. దశాబ్దాలుగా పేదవాడి రక్తాన్ని జలగల్లా పీల్చిన దళారీ వ్యవస్థకు చరమగీతం పాడుతూ, నేరుగా లబ్ధిదారులకే ఫలాలు అందించేలా 'జామ్' ( జన్ ధన్, ఆధార్, మొబైల్) త్రయం సృష్టించిన ప్రభంజనం అంతాఇంతా కాదు. బ్యాంకింగ్ వ్యవస్థలో వచ్చిన ఈ విప్లవాత్మక మార్పుల వల్ల రికార్డు స్థాయిలో 57.78 కోట్ల జన్‌ధన్ ఖాతాలు తెరుచుకోగా, అందులో 55 శాతానికి పైగా మహిళలవే కావడం నారీశక్తి సాధికారతకు ప్రతీక. ఈ ఖాతాల్లో పేదలు దాచుకున్న సొమ్ము ఏకంగా రూ.1.46 లక్షల కోట్లు దాటడం విశేషం. దళారుల ప్రమేయం సమూలంగా నిర్మూలించబడటం వల్ల 2023 నాటికి ప్రభుత్వ ఖజానాకు రూ.3.48 లక్షల కోట్లు ఆదా కావడం పాలకుల నిజాయితీకి నిదర్శనం. డిజిటల్ చెల్లింపుల విషయానికి వస్తే, యూపీఐ సృష్టించిన సునామీతో భారత్ నేడు ప్రపంచాన్నే శాసిస్తోంది. 202526 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 24,161 కోట్లకు పైగా లావాదేవీలు జరిగాయి. ప్రపంచ రియల్ టైమ్ పేమెంట్స్‌లో 49 శాతం వాటా ఒక్క మనదే కావడం గర్వకారణం. దీనికి తోడు యువతను జాతి నిర్మాణంలో భాగస్వాములను చేస్తూ 'స్టార్టప్ ఇండియా' ద్వారా 23.3 లక్షల మందికి ఉపాధి కల్పించడం నవ భారత చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టం.

మౌలిక సదుపాయాల కల్పనలో ఎన్డీయే ప్రభుత్వం మునుపెన్నడూ చూడని రీతిలో పాత రికార్డులను చెరిపేసింది. 2014 నాటికి 91,287 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారులు నేడు 1,46,572 కిలోమీటర్లకు విస్తరించి దేశం నలుచెరుగులా అభివృద్ధి పరుగులకు బాటలు వేశాయి. ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణం ఏకంగా 3,052 కిలోమీటర్లకు పెరగడం రవాణా రంగంలో ఒక పెను విప్లవం. పర్యావరణ హిత రవాణాలో భాగంగా భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లో ఇప్పటికే 99.6 శాతం విద్యుదీకరణ పూర్తి చేసి యావత్ ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసింది.

మరోవైపు ప్రజా సంక్షేమంలో ఈ దశాబ్ద కాలం ఒక మహా యజ్ఞంలా సాగింది. ఆత్మగౌరవ ప్రతీకలుగా స్వచ్ఛ భారత్ ద్వారా గ్రామీణ భారతంలో 12.11 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. దీనివల్ల ప్రాథమిక పాఠశాలల్లో బాలికల డ్రాపౌట్ రేటు 4.6 శాతం నుంచి 0.3 శాతానికి పడిపోయింది. అలాగే, అడుగడుగునా జీవామృతాన్ని పంచుతూ జల్ జీవన్ మిషన్ కింద కేవలం ఐదారేళ్లలో 12.58 కోట్ల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడం అద్భుతమైన విజయం.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ పీఎం ఆవాస్ యోజన కింద గ్రామ, పట్టణ ప్రాంతాల్లో కలిపి కోట్లాది పక్కా ఇళ్ల నిర్మాణం పూర్తయింది. దేశానికి వెన్నెముకైన రైతులకు ఆపద్బాంధవుడిగా నిలుస్తూ పీఎం కిసాన్ కింద అన్నదాతలకు రూ.4.27 లక్షల కోట్లు జమ చేశారు. ఆయుష్మాన్ భారత్ కింద 42 కోట్ల మందికి సంజీవని లాంటి హెల్త్ కార్డులు ఇచ్చి, రూ.1.80 లక్షల కోట్ల ఉచిత వైద్యం అందించడం స్వతంత్ర భారత చరిత్రలోనే కనీవినీ ఎరుగని సంచలనం.

ఒకవైపు ఎన్డీయే కూటమి తన అభివృద్ధి అజెండాతో, తిరుగులేని ప్రజాదరణతో ఎవరికీ అందనంత ఎత్తులో దూసుకుపోతుంటే, మరోవైపు సిద్ధాంతపరమైన దిశానిర్దేశం లేని ప్రతిపక్షాలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన 'ఇండియా కూటమి' సమావేశం అక్షరాలా ఒక రాజకీయ ప్రహసనంగానే మిగిలిపోయింది. నీట్ పరీక్షల లీకేజీ కుంభకోణాన్ని సాకుగా చూపి, నిరుద్యోగం పేరుతో మొసలి కన్నీరు కారుస్తూ అఖిలపక్ష సమావేశం కావాలని డిమాండ్ చేస్తున్న విపక్షాల తీరు వారి దివాళాకోరుతనానికి నిదర్శనం.

పైకి ఐక్యతా రాగాలు ఆలపిస్తున్న ఈ కూటమిలో లోపల మాత్రం కుమ్ములాటలు తారాస్థాయికి చేరాయి. బెంగాల్ రాజకీయాల్లో ఒకరినొకరు బద్ధ శత్రువులుగా చూసుకునే మమతా బెనర్జీ, సోనియా గాంధీలు ఢిల్లీ వేదికపై ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడం వెనుక.. కేవలం తమ రాజకీయ ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకునే ఆరాటమే సుస్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు, తమిళనాడు రాజకీయ సమీకరణాలు ఈ కూటమి పునాదులనే కుదిపేస్తున్నాయి.

అసెంబ్లీ ఎన్నికల్లో 108 స్థానాలు సాధించి సత్తా చాటిన హీరో విజయ్ పార్టీకి కాంగ్రెస్ అనూహ్యంగా మద్దతు ప్రకటించడం డీఎంకే కు ఏమాత్రం మింగుడు పడటం లేదు. దశాబ్దాలుగా విశ్వసనీయ మిత్రపక్షంగా ఉన్న తమకు కాంగ్రెస్ 'చారిత్రక వెన్నుపోటు' పొడిచిందని రగిలిపోతున్న డీఎంకే.. ఇండియా కూటమి సమావేశాలను బహిష్కరించడం వారి ఐక్యతలోని డొల్లతనాన్ని యావత్ దేశం ముందు బట్టబయలు చేసింది.

గత పన్నెండేళ్ల ఎన్డీయే పాలన దేశాన్ని దారిద్ర్యపు చీకట్ల నుంచి ప్రగతి వెలుగుల వైపు నడిపించిన ఒక నవ శకం. నిత్యం అబద్ధాలతో, అంతర్గత కుమ్ములాటలతో, ద్వేషపూరిత రాజకీయాలతో కాలం వెళ్లదీస్తున్న ప్రతిపక్షాల పగటి కలలను, కుట్రలను దేశ ప్రజలు ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తూనే ఉన్నారు. పేదరికం లేని, సర్వతోముఖాభివృద్ధి సాధించిన అఖండ, సంపన్న భారతదేశమే అంతిమ లక్ష్యంగా మోదీ సర్కారు వేస్తున్న అడుగులు నేడు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. రాబోయే రోజుల్లో 'వికసిత్ భారత్' సాధనలో ఈ ప్రభుత్వ దార్శనికత, ఉక్కు సంకల్పం దేశాన్ని మరింత సమున్నత శిఖరాలకు చేర్చడం ముమ్మాటికీ చారిత్రక సత్యం.

- గడల నరసింహారావు,
సీనియర్ జర్నలిస్ట్, ఖమ్మం

# అంతరిక్షంలో పాక్ 'నిఘా' నెట్‌వర్క్

అంతరిక్ష రంగంలో పొరుగు దేశం పాకిస్థాన్ అత్యంత వేగంగా అడుగులు వేస్తూ, భారత సరిహద్దులపై నిఘా పెట్టేందుకు తన అంతరిక్ష సామర్థ్యాన్ని అనూహ్యంగా విస్తరిస్తోంది. చైనా దేశ సాంకేతిక, ఆర్థిక అండదండలతో పాకిస్థాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ గత 16 నెలల స్వల్ప వ్యవధిలోనే ఏకంగా 6 అత్యాధునిక ఎర్త్ అబ్జర్వేషన్ (భూ పరిశీలన) ఉపగ్రహాలను నింగిలోకి పంపడం అంతర్జాతీయ రక్షణ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భారత భూభాగాలు, ముఖ్యంగా జమ్మూకశ్మీర్ సరిహద్దు ప్రాంతాలతో పాటు హిందూ మహాసముద్రంలో భారత నావికాదళ కదలికలపై నిరంతర నిఘా ఉంచడమే లక్ష్యంగా పాక్ ఈ ప్రయోగాలు చేపట్టినట్లు ప్రముఖ జాతీయ వార్తా సంస్థ 'ది ప్రింట్' తన పరిశోధనాత్మక కథనంలో వెల్లడించింది. గత 2025 జనవరి నుంచి 2026 ఏప్రిల్ మధ్య కాలంలో పాకిస్థాన్ వరుసగా పౌశాట్ 1 పిఆర్‌ఎస్‌సిఇఓ1, ఇఓ2, ఇఓ3, పిఆర్‌ఎస్‌ఎస్2, హెచ్‌ఎస్1 వంటి కీలక ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. వీటిలో మెజారిటీ ఉపగ్రహాలను చైనాకు చెందిన జియుక్వాన్, తైయువాన్ ప్రయోగ కేంద్రాల నుంచి చైనా లాంగ్ మార్చ్ రాకెట్ల ద్వారా కక్ష్యలోకి పంపారు. సన్‌సింక్రోనస్ కక్ష్యలలో తిరిగే ఈ ఉపగ్రహాలు ప్రతి రెండు రోజులకు (48 గంటలకు) ఒకసారి భారత భూభాగంలోని అత్యంత సున్నితమైన రక్షణ ప్రాంతాలను స్పష్టంగా చిత్రించగలవని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి పౌర అవసరాల కోసమే ఈ ఉపగ్రహాలని పాక్ పైకి చెబుతున్నప్పటికీ.. భారత సైనిక కదలికలను గుర్తించడం, క్షేత్రస్థాయిలోని రహస్య ఆస్తులను పసిగట్టడమే వీటి అసలు ఉద్దేశమని స్పష్టమవుతోంది.

వీటన్నింటిలో 'పి ఆర్ ఎస్ సి ఈ ఓ త్రీ' అనే శక్తివంతమైన ఎలక్ట్రోఆప్టికల్ ఉపగ్రహాన్ని భారత్, పాకిస్థాన్, కశ్మీర్ ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించేలా ఒక ప్రత్యేకమైన కక్ష్యలో ప్రవేశపెట్టినట్లు అమెరికాకు చెందిన స్పేస్ అనలిటిక్స్ సంస్థ 'కామ్‌స్పాక్ గుర్తించింది. 1961లో ఏర్పాటైన పాక్ అంతరిక్ష సంస్థ సుపార్కో.. ఇప్పటివరకు తన సుదీర్ఘ చరిత్రలో కేవలం 15 ఉపగ్రహాలను మాత్రమే ప్రయోగించగా, అందులో 6 ఉపగ్రహాలను కేవలం ఈ 16 నెలల్లోనే ప్రయోగించడం గమనార్హం. చైనా ఇప్పటికే తన స్వంత ఉపగ్రహాల ద్వారా భారత్‌పై నిఘా పెడుతోందని, ఇప్పుడు పాకిస్థాన్ అంతరిక్ష విభాగాన్ని కూడా తన చేతుల్లోకి తీసుకుని త్రైపాక్షిక వ్యూహంతో భారత క్షణ రంగానికి సవాలు విసురుతోందని ఇస్రో మాజీ ఉన్నతాధికారి ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు. చైనా, పాకిస్థాన్‌ల ఉమ్మడి అంతరిక్ష సవాలును తిప్పికొట్టేందుకు భారతదేశం సైతం అత్యంత పటిష్ఠమైన రక్షణ వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా 'స్పేస్ బేస్డ్ సర్వైలెన్స్ ఫేజ్ III' ప్రాజెక్టు కింద ఏకంగా రూ.26,968 కోట్ల (సుమారు 27వేల కోట్ల) భారీ బడ్జెట్‌తో 52 సరికొత్త నిఘా ఉపగ్రహాల కూటమిని (కాన్‌స్టెల్లేషన్) ఏర్పాటు చేసేందుకు కేంద్ర కేబినెట్ కమిటీ ఇప్పటికే ఆమోదం తెలిపింది. 2025 నుంచి ప్రారంభమై 2029 నాటికి పూర్తి కానున్న ఈ మెగా ప్రాజెక్టులో.. 21 ఉపగ్రహాలను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ స్వయంగా అభివృద్ధి చేస్తుండగా, మిగిలిన 31 ఉపగ్రహాలను దేశీయ ప్రైవేట్ అంతరిక్ష సంస్థల భాగస్వామ్యంతో నిర్మించనున్నారు. ఈ 52 ఉపగ్రహాల కూటమి ద్వారా చైనా, పాకిస్థాన్ సరిహద్దులతో పాటు మొత్తం హిందూ మహాసముద్ర ప్రాంతంపై భారత్ పూర్తి స్థాయి 'డేగకన్ను' వేయనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్వాంటం ఎన్‌క్రిప్షన్, సింథటిక్ అపెర్చర్ రాడార్ వంటి అత్యాధునిక సాంకేతికతలతో రూపుదిద్దుకుంటున్న ఈ ఉపగ్రహాలు.. ఎంతటి దట్టమైన మేఘాలు ఉన్నా, చీకటిగా ఉన్నా సరే శత్రుదేశాల కదలికలను, మొబైల్ క్షిపణి వ్యవస్థల మోహరింపును క్షణాల వ్యవధిలో 24 గంటలూ రికార్డ్ చేసి భారత కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిస్తాయి. శత్రువుల నిఘా నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేస్తూ అంతరిక్షంలో భారత రక్షణ ఆస్తులను కాపాడేందుకు ప్రత్యేక 'బాడీగార్డ్ శాటిలైట్ల'ను కూడా భారత్ సిద్ధం చేస్తుండటం విశేషం. దీనితో అంతరిక్ష యుద్ధ తంత్రంలోనూ టీమిండియా తన తిరుగులేని ఆధిపత్యాన్ని నిరూపించుకునేందుకు సన్నద్ధమైంది.

- మహా డెస్క్





# సంక్షేమ అభివృద్ధి పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు

- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వేగవంతమైన చర్యలు
- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక తో గ్రామాలు బాగుపడ్డాయి
- సమస్యల పై అధికారులు దృష్టి సారించాలి
- సింగరేణి కాలరీస్ నిధుల సాధనకు కృషి
- సింగరేణి సర్పంచ్ మేదరి టోనీ

**కారేపల్లి, మహా:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ,అభివృద్ధి పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం సింగరేణి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో వివిధ శాఖలతో సమీక్ష నిర్వహించి ప్రజలకు సంభందించిన సమస్యలపై సర్పంచ్ అధికారులతో మాట్లాడించారు. ఈ సభలో సర్పంచ్ టోనీ మాట్లాడారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వేగవంతమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమంతో గ్రామాలు బాగుపడ్డాయి అని చెప్పారు. వ్యవసాయానికి పెద్ద పీట వేస్తూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందనీతెలిపారు. ఈ పథకం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. సింగరేణి గ్రామంలో విద్యుత్ లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. పంట వ్యర్థాలను కాలిస్తే జరిమానా విధించడం జరుగుతుంది. రైతులు ఈ విషయం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో భవన నిర్మాణం చేపట్టే యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. ఈ సభలో ఎంపీడీవో మల్లెల రవీంద్ర ప్రసాద్, ఏవో అశోక్ కుమార్,ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ ఏఈ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ, జీపీవో బంపర్ పాల్గొన్నారు.




# ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలు సమగ్ర అభివృద్ధి

**గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి విద్యాచందన**

**జూలూరుపాడు, మహా:** ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి విద్యాచందన అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల పరిధి మాచినేని పేట తండా గ్రామపంచాయతీలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయితీ ఆవరణంలో సర్పంచ్ రెడ్డితో కలిసి మొక్కను నాటారు. అనంతరం గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు ముఖ్య అంశాలపై గ్రామస్థులకు ఆమె అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం ద్వారా పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. వర్షాకాలం తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు, కాలువల శుభ్రత, నీటి నిల్వలు నివారణ, పారిశుధ్య చర్యల ప్రాధాన్యత గురించి వివరించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టబడుతున్న వివిధ అభివృద్ధి పనులు, వాటి ద్వారా గ్రామాలకు కలిగే ప్రయోజనాలు, ప్రజల భాగస్వామ్యం గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు చేయవలసిన పంటలు, పంటల వైవిధ్యీకరణ, వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలు, సలహాలను గ్రామ సభలో వివరించారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామ సభలు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లే అత్యంత ప్రభావవంతమైన వేదికలని పేర్కొన్నారు. గ్రామ సభలకు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు.

గ్రామ సభలకు హాజరు కాని శాఖల అధికారుల వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని ఎంపీడీఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లాకావత్ రెడ్డి, ఏపీడి రమణ, ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎంపీఓ తులసిరామ్, ఎంఈఓ జుంకీలాల్, ఎస్సై రవి తోపాటు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కే.వి.ఆర్ ప్రైవేట్ ట్రావెల్ బస్సుకు పెను ప్రమాదం

- పెనుబల్లి మండలం కొత్త లంకపల్లి రైల్వే బ్రిడ్జిపై ఘటన.
- 22 మందికి స్వల్ప, నలుగురికి తీవ్ర గాయాలు

**సత్తుపల్లి, జూన్ 8: మహా :** వేంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన కే.వి.ఆర్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆంధ్ర రాష్ట్రంలోని ధర్మాజీగూడెం ప్రాంతం నుండి 36 మంది ప్రయాణికులతో హైదరాబాద్ ప్రయాణిస్తుండగా ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్త లంకపల్లి రైల్వే బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో 22 మందికి స్వల్ప గాయాలు కాగా నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్ సహాయంతో సత్తుపల్లి, పెనుబల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులకు తరలించారు. బాధితుల సమాచారం మేరకు కే.వి.ఆర్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మితిమీరిన వేగంతోనే ప్రమాదం సంభవించినట్లు తెలిపారు. డ్రైవర్ పక్క సీటు ప్రయాణికుడు వేగం తగ్గించమని వారించినప్పటికీ డ్రైవర్ వినకుండా ముందు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఓవర్టేక్ చేస్తున్న క్రమంలో రైల్వే బ్రిడ్జి కుదుపుకు ముందు చక్రాలు విరిగిపోవడంతో బస్సు అదుపుతప్పి పల్టీ కొట్టిందని తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సులు వరుస ప్రమాదాలకు గురవుతున్నప్పటికీ ఈ విషయంపై బస్సు యాజమాన్యాలు, ప్రభుత్వ అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో డ్రైవర్ల అత్యుత్సాహంతో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ప్రయాణికులు ఆ వేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి గాయపడిన ప్రయాణికులకు బస్సు యాజమాన్యం నుండి నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.





# కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం..

- కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలు..
- 10న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి..
- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్..




**మణుగూరు, మహా:** కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ ఆరోపించారు. సోమవారం మణుగూరులోని సీపీఐ కార్యాలయంలో రాయల బిక్షం అధ్యక్షతన నిర్వహించిన ఏఐటీయూసీ మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను బలహీనపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించిందని విమర్శించారు. దేశంలో సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికుల భవిష్యత్తుపై కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా విధానాలు అమలు చేస్తూ, సామాన్య మరియు మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతోందని ఆరోపించారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలని, కార్మిక సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. ఎన్నికల అనంతరం పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను పెంచి సామాన్యులపై మోయలేని భారం మోపిందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ లక్ష్మీనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, వేర్పుల మల్లికార్జున్, తోట రమేష్, కొత్తపల్లి సీతారాములు, ఇమాముద్దీన్, బోసెట్టి సంపత్, ఆర్టీసీ మురళి, సిరిగద్దె సతీష్, ఎం.ఏ. రాజు, పగిడయ్య, కన్నెబోయిన ప్రసాద్, కోడిమల్ల సుజాత, ఆదర్ల రాములు, రాంబాబు, కణతాల కోటయ్య, యాకూబ్, లింగస్వామి, యాకయ్య తదితర ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# కేసీఆర్ హయాంలోనే కొలువుల నోటిఫికేషన్లు

- నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్ దే
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర




**భద్రాద్రి బ్యూరో, మహా:** నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్ దేనని తెచ్చుకున్న తెలంగాణలో యువత కీలక పాత్ర పోషించడం జరిగిందని గత పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ హయాంలో నిరుద్యోగులకు సుమారు 1 లక్షా 67,000 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని రాజ్యసభ సభ్యుడు బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర అన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నదమవుతున్న విద్యార్థి, నిరుద్యోగులను ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డిచే ప్రత్యేకంగా రూపొందించిన "Rakesh Reddy EClasses App" ను కొత్తగూడెం క్లబ్ లో సోమవారం రాజ్యసభ సభ్యుడు బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలకు తూట్లు పొడిచిందన్నారు. నిరుద్యోగ యువతకు అనేక వాగ్దానాలు చేసి మూడేళ్లు కావస్తున్న ఉద్యోగాలు ఇచ్చే విషయంలో ఊసెత్తడం లేదన్నారు. తెలంగాణ తెచ్చిన పార్టీనే శ్రీ రామ రక్ష అని తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండాలన్నారు. పార్లమెంట్ లో మన ఎంపీలు ఉన్నప్పుడే మన తెలంగాణకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని తెలిపారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యసభలో ముగ్గురం బీఆర్ఎస్ ఎంపీ లము ఉంటే అనేక అంశాల మీద పోరాడటం జరుగుతుందని నిరుద్యోగ అంశంపై కూడా పోరాడుతామని భరోసా ఇచ్చారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో ముఖ్యంగా పరిశ్రమల ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కృషితో ఐటీ రంగం, ఫార్మా రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెంది దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.బీఆర్ఎస్ పార్టీ కేవలం నిరుద్యోగుల పక్షాన పోరాడటమే కాకుండా వారి ప్రిపరేషన్ లో తోడుగా ఉండటానికి బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి "Rakesh Reddy E Classes App"ను రూపొందించి పూర్తిగా అందించడం అభినందనీయమన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**యువత నోట్లో మన్ను కొట్టిన రేవంత్ రెడ్డి...**

జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువత కాంగ్రెస్ ప్రభుత్వం నుండి ఉద్యోగ ప్రకటన వస్తుందని ఎంతగానో ఆశించారని కానీ మునుపటి లాగే రేవంత్ రెడ్డి నిరుద్యోగ యువత నోట్లో మన్ను కొట్టడం దుర్మార్గమని ఏనుగుల రాకేష్ రరెడ్డి ధ్వజమెత్తారు.

ఒక్క ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి ఆకరికి మూడేళ్ల తర్వాత ఒక 5 వేలు ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని అదే జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు నిరుద్యోగ భృతి జాబ్ క్యాలెండర్ వంటి అనేక హామీలిచ్చి మాట తప్పిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వర్ రావు, తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో రేవంత్ రెడ్డి వ్యవహారం తో అప్పుడే జనాలు విసుగు చెందారని ఇంత స్వల్ప కాలంలో ఇంతటి ప్రజా వ్యతిరేకత మూటకట్టుకున్న ఏకైక ప్రభుత్వం ప్రపంచంలో ఇదేనని అన్నారు. గత శాసన మండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ పక్షాన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసిన ఏనుగుల రాకేష్ రెడ్డి స్వల్ప తేడాతో ఓటమి చెందినప్పటికీ గెలిచిన అభ్యర్థి కంటికి కానరకున్నా రాకేష్ రెడ్డి నిరంతరం విద్యార్థులు నిరుద్యోగులు ఉద్యోగుల సమస్యలపై పోరాడుతూ తిరుగుతున్నారని అన్నారు.

తెలంగాణ ప్రజల గురించి నిరుద్యోగ యువత గురించి మనసుపెట్టి ఆలోచించి పరిష్కారం చూపే ఏకైక పార్టీ బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు తోడుగా ఉండాలన్న సంకల్పంతో రాకేష్ రెడ్డి అందిస్తున్న యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దిండిగాల రాజేందర్, ఫైన్ ఇంటిట్యూట్ నిర్వాహకులు జలీల్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సీతా మహాలక్ష్మి, కిలారు నాగేశ్వర రావు, మానే రామకృష్ణ, వనమా రాఘవేందర్, యువనేత అనుదీప్, స్థానిక కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

- ఏపైనా ప్రాజెక్టులకు కొమరయ్య శేషగిరిరావు విఠల్ రావు పేర్లను పెట్టాలి
- యాజమాన్యానికి నేడు సమ్మె నోటీస్
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కార్మికుల శ్రమ శక్తితో మనుగడ సాగిస్తున్న సింగరేణి సంస్థ, అదే సంస్థల్లో అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులను ప్రభుత్వాలు, యాజమాన్యం కట్టుబానిసలుగా చూడడం సరైంది కాదని కార్మిక సమస్యలను పరిష్కరించకుంటే సింగరేణి వ్యాప్తంగా సమ్మెకు సిద్ధమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియూసి) గౌరవ అధ్యక్షులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రెండురోజులుగా వర్కర్స్ యూనియన్ జాతీయ కౌన్సిల్సమావేశాలు రుద్రంపూర్లో ఆర్సిఓఏ క్లబ్లో జరిగాయి. చివరి రోజు సోమవారం ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేసిన విలేకరుల సమావేశంలో కూనంనేని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణిని బంగారుబాతులా వాడుకుంటున్నాయని సంస్థ మనుగడకు పాటుడుతూ ఉత్పత్తిని ఆదాయాన్ని పెంచే మార్గాలను వదిలిపెట్టి సంస్థలో ఉన్నదంతా దోచుకుని సంస్థ మూసివేసే దశకు చేరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక యంత్రాల ద్వారా సంస్థ పనులు చేయించి కార్మికులు లేకుండా చేయలనే ఉద్దేశ్యంతో ఉన్నారని చెప్పారు. ఇక్కడ ఇత్పత్తి అయ్యే బొగ్గులో నాణ్యత లేదనే సాకులు చూపుతున్నారని నాణ్యత తక్కువగా ఉన్న బొగ్గును కలిపి అవసరమైన పరిశ్రమలకు విక్రయించేందుకు దృష్టి సారించాలని చెప్పారు. దీనిని సాకుగా చూపి సింగరేణి మనుగడను దెబ్బతీయాలని చూస్తే ఊరుకోమని చెప్పారు. సంస్థ నష్టాల్లో నడుస్తోందంటూ చెబుతున్నారని ఎవరి వల్ల నష్టాలు వచ్చాయని ఎందుకు వస్తున్నాయని దానికి కారణాలు ఎంటో తేల్చాలన్నారు.

# బొంతు వేణుకి ఎమ్మెల్యే దంపతుల పరామర్శ



**సత్తుపల్లి,జూన్ 8: మహా :** పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత భర్త కాంగ్రెస్ నాయకులు బొంతు వేణు గత కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దయానంద్ విజయకుమార్ బొంతు వేణు నివాసంలో ఆయనను పరామర్శించారు. ఎమ్మెల్యే దంపతులు స్వతహాగా ప్రముఖ వైద్యులు కావడంతో వేణు అనారోగ్య లక్షణాలు తెలుసుకొని, వైద్య సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రెహానా బేగం కమల్ పాషా, సత్తుపల్లి ఏ.ఎం.సి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, సీనియర్ నాయకులు చల్లగళ్ళ నరసింహారావు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ప్రతి దరఖాస్తును పరిశీలించి సమస్యను పరిష్కరించాలి

**భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి బ్యూరో, మహా:** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతితో కలిసి ప్రజల నుంచి వచ్చిన వినతులు ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి అర్హత మేరకు వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే అంశాలను వెంటనే పరిష్కరించాలని మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేదా నిర్లక్ష్యానికి తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ప్రతి సమస్య వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా సేవల్లో పారదర్శకత జవాబుదారీతనం ఉండాలని ప్రజలు తమ వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని ప్రజల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కట్టుబడి పనిచేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య

**నేలకొండపల్లి, జనవరి 8 మహా:** మండలంలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య కు పాల్పడిన ఘటన "చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని ఆజయ్ తండా కు చెందిన బాణోత్ గోపి (24) అనే యువకుడు తన ఇంట్లో అదివారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. ఇంట్లో ఉరేసుకున్న యువకుడు కు స్థానికులు సీపీఆర్ చేశారు. కానీ ఫలితం కనిపించకపోవటంతో నేలకొండపల్లి ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. గ్రామానికి చెందిన ఓ వివాహిత తో వివాహేతర సంబంధం నేపధ్యంలో సదరు మహిళ వేధింపులు కారణంగా ఉరేసుకుని ఆత్మహత్య కు పాల్పడినట్లు స్థానిక పోలీస్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మృతుడు తల్లి జయమ్మ ఫిర్యాదు "మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ హస్పిటల్ లో మృతదేహం కు పోస్టుమార్టమ్ నిర్వహించారు.



# గ్రామీణ క్రీడాకారులు... ప్రపంచ స్థాయి వరకు ఎదగాలి

**క్రీడా ప్రాంగణం ను ప్రారంభించిన దయాకర్ రెడ్డి.**




**నేలకొండపల్లి, జూన్ 8 మహా:** గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభ చూపి ప్రపంచ స్థాయి వరకు ఎదగాలని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్రెడ్డి సూచించారు. మండలం లోని నాచేపల్లి లో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం ను సోమవారం దయాకర్రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు... క్రీడలకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపోందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా స్వచ్ఛంధ సంస్థలు కూడ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయం అన్నారు. క్రీడాకారులు గ్రామంతో పాటు దేశం కు మంచి పేరు వచ్చేలా క్రీడలలో రాణించాలని సూచించారు. అనంతరం క్రికెట్ ను క్రీడాకారులతో ఆడి... వారిలో ఉత్సాహం ను నింపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్పంచ్ మౌనిక, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, మండలాధ్యక్షుడు కొడాలి గోవిందరావు, భద్రయ్య, నల్లాని మల్లిఖార్జునరావు, మక్తాల రామకృష్ణ, విజయ్, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలుకుదాం:కేఎల్ఆర్

- ప్రపంచ దిగ్గజాలకు విశ్వాసం కలిగేలా "ఫ్యూచర్ సిటీ'
- కాలుష్యం లేని మహానగరంగా కొత్తపట్టణం నిర్మిస్తాం..
- జిహెచ్ఎంసి డివిజన్ నాయకులతో లక్ష్మారెడ్డి ప్రత్యేక సమావేశం
- విపక్షాల గాలి మాటలు నమొద్దు- ప్రభుత్వంపై నమ్మకం ఉంచండి
- మహేశ్వరం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఫ్యూచర్ సిటీని అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని కారు కూతలు కూసే బీఆర్ఎస్ నేతల మాటలను పట్టించుకోవద్దని, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఇవాళ మీర్ పేట, నందిహిల్స్, జిల్లెలగూడ, బడంగ్ పేట, నాదర్ గుల్, బాలాపూర్ డివిజన్ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో మల్లాపూర్ లోని వైఎఆర్ ఫంక్షన్ హాల్ లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 10న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ (FCDA), స్కిల్ యూనివర్శిటీ భవనాలను ప్రారంభించనున్నారు. అనంతరం జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ శ్రేణులను కేఎల్ఆర్ కోరారు. ప్రపంచ స్థాయి దిగ్గజ సంస్థలకు నమ్మకం కలిగేలా ఫ్యూచర్ సిటీని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. కాలుష్యం లేని మహానగరంగా తీర్చిదిద్దేందుకు గ్రీన్ ఫార్మా, పర్యావరణ హితమైన సంస్థలకే అనుమతులు ఇస్తున్నట్లు కిచ్చెన్నగారు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గానికి మైలురాయి కానున్న ఫ్యూచర్ సిటీలో జరిగే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని కేఎల్ఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఏలిమేటి అమరేందర్ రెడ్డి సహా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజావాణికి 121 ఫిర్యాదులు

- ఫిర్యాదులకు సత్వర పరిష్కారం కల్పించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 121 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 27 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించిన 94 దరఖాస్తులు అందగా, మొత్తం 121 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంత రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఆయుర్వేద గుళికల పంపిణీ

**ఆదిలాబాద్ మహా :** ఉబ్బస వ్యాధి గ్రస్తులకు ఆయుర్వేద మందు ఎంతో చక్కగా పని చేస్తుందని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు యువరాజ్ వైద్య తెలిపారు. మృగశిర కార్తె పురస్కరించుకుని ఉబ్బసం వ్యాధి నియంత్రణ, రోగనిరోధక శక్తి పెంపునకు అందించే ఉచిత ఆయుర్వేద మందు పంపిణీని ఆయన చేపట్టారు. సోమవారం పట్టణంలోని వైద్య ఆయుర్వేదిక్ రీసెర్చ్ సెంటర్ పంపిణీ చేసిన ఈ మందు తీసుకోవడానికి జిల్లా నుండే కాకుండా మహారాష్ట్ర నుండి కూడా ప్రజలు భారీగా తరలివచ్చారు. రుతువులు మారే క్రమంలో వచ్చే వ్యాధులను తట్టుకోవడానికి ఆయుర్వేద ఔషధం దివ్యంగా దోహదపడుతుందని ఆయన తెలిపారు. గత 28ఏళ్లుగా మందు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.

# దొంగ ఓట్లతో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చింది

- ఏ క్షణంలో అయినా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది..
- త్వరలోనే పార్టీ కమిటీలు వేసుకుందాం
- బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి
- సభ్యత్వ నమోదు, దొంగ ఓట్ల తొలగింపులో పార్టీ శ్రేణులు పకడ్బందీగా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచన



**మొయినాబాద్ మహా:**ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణంలో అయినా వచ్చే అవకాశం ఉందని... దొంగ ఓట్లను తొలగించి. అర్హత కలిగిన ఓట్లను నమోదు చేయించే విధంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కష్టపడి పని చేయాలని, జాగ్రత్తగా పకడ్బందీగా వ్యవహరించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి సూచించారు. సోమవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లో చేవెళ్ల నియోజవర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశాన్ని మొయినాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో సబితా ఇంద్రారెడ్డి పాల్గొని పార్టీ శ్రేణులకు పార్టీ సభ్యత్వ నమోదు, ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వేపై పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో దొంగ ఓట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అంతేకాకుండా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ, అధికార బలంతో ఎన్నికల్లో గెలిచిందని ఆరోపించారు. ఈ విషయంలో పార్టీ శ్రేణులు బలంగా ఉండి ఓటర్ లిస్టులో తప్పు ఒప్పులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ తప్పులు దొర్లకుండా చూసుకోవాలని అన్నారు. ఓటు హక్కు లేని వారిని ఓటరుగా నమోదు చేసే విధంగా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. త్వరలో పార్టీ నూతన కమిటీలు అధిష్టానం ఆదేశానుసారం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కష్టపడి పనిచేసిన వారికి కమిటీలో సముచిత న్యాయం జరుగుతుందన్నారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఇప్పటినుంచే ప్రజల్లో ఉండి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే విధంగా పనిచేయాలి. బీఎల్ఓఎస్ సిబ్బంది సహకరించకుంటే ఎన్నికల కమిషన్ కు పిర్యాదు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రతి బూతులో బోగస్ ఓట్లను తొలగించే విధంగా పనిచేయాలన్నారు. ప్రతి వారానికోసారి ఓటర్ లిస్టును క్షుణ్ణంగా పరిశీలిస్తూనే ఉండాలన్నారు. క్రియాశీల సభ్యత్వానికి రూ. 50 సభ్యులు చెల్లించాలని తెలిపారు. గత ఎన్నికల్లో చిన్న పాటి ఓట్లతోనే కొన్ని చోట్ల ఓడి పోవడం జరిగిందని... అలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వేలో పాల్గొని జాగ్రత్తగా ఓటర్ల నమోదులో పని చేయాలని సూచించారు. అలాగే బోగస్ ఓట్లు తొలగించే విధంగా పని చేసి అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయించాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఎన్నో దొంగ ఓట్లతో కాంగ్రెస్ పార్టీ గెలిచిన విషయం మన అందరికీ తెలుసన్నారు. ఎమ్మెల్యే గెలవాలంటే ముందుగా వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గెలవాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యకర్తలు పార్టీ నాయకులు సైనికులు లాగా పనిచేయాలని సూచించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఏ రోడ్డు వేసిన ఒకటే కాంట్రాక్టర్ ఇవ్వాలనే ప్రత్యేక నిబంధన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. కేసీఆర్ హయంలోనే 90 శాతం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి అయిందని చెప్పారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతుల ప్రాజెక్టు పై బీఆర్ఎస్ నాయకులు ధర్నాకు పూనుకుంటే ఉలిక్కిపడ్డా రేవంత్ రెడ్డి సమీక్ష పేరిట డ్రామా చేస్తున్నాడని ఆరోపించారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు గతంలో మెట్రో ఏర్పాటు చేసేందుకు కేసీఆర్ ప్రణాళిక చేస్తే అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసి ఇక్కడి ప్రజలకు రేవంత్ రెడ్డి తీవ్ర అన్యాయం చేశాడని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్ హయంలోనే 111జీవో రద్దు చేసినట్లు గుర్తు చేశారు. విధివిధానాలు ఖరారు కాకపోవడం.. ఎన్నికలు రావడంతో కార్యరూపం దాల్చలేదని ఆరోపించారు. కచ్చితంగా తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ తెలంగాణకు శ్రీరామరక్ష అని తెలిపారు. మోడీ, రేవంత్ రెడ్డిలు ఇద్దరు ఒక్కటేనని అన్నారు. డిల్లీకి వెళ్లి ధాన్యం కొనండి అని అడిగే ధైర్యం లేదని విమర్శించారు. త్వరలోనే యాప్ వస్తుందని సభ్యత్వం నమోదులో అందరూ క్రియాశీలకంగా పాల్గొనాలని సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. బూత్ సాయి అభివృద్ధి కోసం నలుగురు తో కమిటీ వేయడం జరుగుతుందని సభ్యులను త్వరలో పంపించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ ఇన్చార్జ్ రాంబాబు, సీనియర్ నాయకులు కొంపల్లి అనంత రెడ్డి, కృష్ణారెడ్డి, దేశమల్ల ఆంజనేయులు, షాబాద్ మాజీ జడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాష్ రెడ్డి, మొయినాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, కొత్త నరసింహారెడ్డి, ముదిగొండ శ్రీహరి యాదవ్, ముదిగొండ రవి యాదవ్, లీగల్ సెల్ మండల అధ్యక్షుడు సురేందర్ గౌడ్, రవూఫ్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మోర శ్రీనివాస్, మండల మైనార్టీ నాయకుడు సలీంఖాన్, సంగెం రాజు గౌడ్, జల్లెల మల్లేష్ యాదవ్, నియోజకవర్గంలోని ఆయా మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సత్కారం

**ఆదిలాబాద్ మహా:** అసోసియేషన్ అఫ్ ఫిజీషియన్స్ అఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ గా నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, సాహితీవేత్త డాక్టర్ దామెర రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా దామెర సాహితి క్షేత్రంలో సోమవారం ఆయన మిత్రులు ,సాహితీవేత్తలు,పలువురు వైద్యులు ఆయనను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. గత నాలుగు దశాబ్దలుగా ఆయన వైద్య సేవలతో పాటు సాహితీ సేవలు చేస్తున్నారని వక్తలు కొనియాడారు.ఆయన సేవలకు తగిన గౌరవం దక్కిందని అన్నారు.తన ఎన్నిక పట్ల డాక్టర్ దామెర రాములు ఆనందం వ్యక్తం చేసారు. తన బాధ్యతను ఈ ఎన్నిక మరింత పెంచిందన్నారు. మారుమూల గ్రామాలకు వైద్య సేవలు విస్తరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. ఇందుకు వైద్యలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అప్పాల చక్రధారి, కృష్ణంరాజు, కె. మురళీధర్, తెరవే నిర్మల్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు , కవులు తుమ్మల దేవరావు, పోలీస్ భీమేష్, అంబటి నారాయణ,పత్తి శివప్రసాద్ ,కుమ్మరి నాగారంతదితరులులు పాల్గొన్నారు.



# ప్రజా భాగస్వామ్యం తోనే మార్పు..

- గ్రామ సభలో కలెక్టర్ వెల్లడి

**ఆదిలాబాద్ మహా**: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, సమగ్ర రూపాంతరం కేవలం ప్రజా భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం నార్నూర్ మండలం కొత్తపల్లి (హెచ్) గ్రామంలోని నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గ్రామసభలో గ్రామస్తుల నుంచి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న కలెక్టర్.. వాటి పరిష్కారానికి తక్షణమే నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, నిధులను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు సూచించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వ్యవసాయం వర్షపాతం పైనే ఆధారపడి ఉన్నందున, రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి ఆశించిన వర్షాలు పడకపోతే పెసర్లు, కందులు, మినుములు, సోయాబీన్ వంటి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలన్నారు. ముందస్తు విత్తనాలు వేసి నష్టపోవద్దని, పదును పద్దాకే విత్తాలని వ్యవసాయ అధికారుల సలహాలను గుర్తు చేశారు. అలాగే తక్కువ ధరకే అమ్మే నకిలీ విత్తనాలను నమ్మి మోసపోవద్దని, కేవలం ప్రభుత్వ గుర్తింపు పొందిన లైసెన్స్డ్ డీలర్ల వద్దే కొనుగోలు చేసి రసీదులు భద్రపరుచుకోవాలని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై సమాచారం ఇస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ టాయిలెట్లను, పుల్లబాయిదేవిదాస్ లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల గృహ గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరై కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఆర్డీఓ మోహన్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీవో పుల్లారావు, సర్పంచ్ చవాన్ దిగంబర్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# 8మంది ఇన్స్పెక్టర్ల బదిలీలు

**ఉత్తర్వులు జారీ చేసిన వరంగల్ సీపీ**

**మహా వరంగల్ బ్యూరో ;**వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విఆర్ లో విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మంది ఇన్స్పెక్టర్లకు వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కె. ప్రవీణ్ కుమార్ హనుమకొండ ట్రాఫిక్, సుబ్బారెడ్డి టాస్క్ ఫోర్స్, దేవేందర్ టాస్క్ ఫోర్స్, దామోదర్ రెడ్డి సిసిఆర్బి , చేరాలు ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్, ఓ. రమేష్ , ఏ హెచ్ టి యు, ఎ. ప్రవీణ్ కుమార్ పి సి ఆర్ , కమాండ్ కంట్రోల్ అదనపు బాధ్యతలు అప్పగించడం జరిగింది.



# బల్దియా ప్రజావాణికి 66 ఫిర్యాదులు

- నత్త నడకన పరిష్కారాలు రూటు మార్చిన బాధితులు
- ఫిర్యాదులను నేరుగా కలెక్టర్ కు సమర్పిస్తున్న బాధితులు

**వరంగల్ కార్పొరేషన్ మహా ;**అసలే బల్దియా ఇందులో ప్రజా ఫిర్యాదులకు అంత త్వరగా పరిష్కారం చూపరనే అపవాదులు తెచ్చిపెట్టారు సంబంధిత అధికారులు సిబ్బంది. కమిషనర్ ఉన్నప్పుడే సమస్యలకు పరిష్కారం చూపని టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, ఇతర సిబ్బంది బల్దియా కు పెద్ద దిక్కు లేకపోయే సరికి స్వీకరించిన ఫిర్యాదులను పట్టించుకునే నాథుడే లేదనే నింద నిజమవుతోంది. దీంతో తిరిగి తిరిగి వేసారిన కొంతమంది బాధితులు నేరుగా హనుమకొండ కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కు క్యూ కడుతున్నారని తెలుస్తోంది.
అయితే గతంలో బల్దియా కమిషనర్ గా ఉన్న చాహత్ బాజ్ పాయ్ ఇటీవల హనుమకొండ జిల్లా కలెక్టర్ గా వెళ్లగా ఇన్చార్జి కమిషనర్ నుండి ప్రస్తుతం ప్రత్యేక పాలన అధికారిగా ఆమె కొనసాగుతున్నారు.
బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో నిన్న అనగా (సోమవారం) ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించగా ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చిన కొంతమంది బాధితులు బల్దియా గ్రీవెన్స్ లో కమిషనర్ ఉండడం లేదని తెలుసుకొని కొంతమంది బాధితులు హనుమకొండ కలెక్టరేట్ కు చేరుకుని నేరుగా కలెక్టర్ కు ఫిర్యాదులను సమర్పించారని తెలుస్తోంది.

# వరంగల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణికి 209 దరఖాస్తులు

- ప్రజల సౌకర్యార్థం జిల్లా నుంచి డివిజన్ స్థాయిలలో ప్రజా వాణి నిర్వహణ
- దరఖాస్తులను త్వరగా పరిష్కరించి ప్రజావాణి పోర్టల్ లో అప్డేట్ చేయాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మహా వరంగల్ బ్యూరో;** ప్రజల సౌకర్యార్థం జిల్లా నుంచి డివిజన్ స్థాయి వరకు ప్రజావాణిలో మొత్తం 209 దరఖాస్తులను సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణికి జిల్లా నుండి 171 దరఖాస్తులు రాగా, డివిజన్ స్థాయిలలో వరంగల్ 24, నర్సంపేట 14 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డి ఆర్ ఓ విజయ లక్ష్మి, డిఎం అండ్ హెచ్ ఓ సాంబశివరావు, తదితర అధికారులు పాల్గొని ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులు రెవెన్యూ 85, హౌసింగ్ 23, మున్సిపాలిటీ 44 రాగా, మిగతా శాఖలకు సంబంధించి 57 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు ఎండార్స్ చేస్తూ, వాటిని సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొనగా, అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు ఈ ప్రజావాణి కార్యక్రమానికి వినతులు సమర్పించారు. జిల్లా స్థాయి ప్రజావాణితో పాటు రెవెన్యూ డివిజన్ స్థాయిలలో ప్రజావాణి నిర్వహించడం జరిగింది. వరంగల్ డివిజన్ పరిధిలో వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డిఓ పరిధిలో నర్సంపేట ఆర్డిఓ ఉమారాణిలో పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించి త్వరితగల్సిన పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రజలు రెవెన్యూ స్థాయిలలో ప్రజావాణి నిర్వహించడం పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధి కే గ్రామసభలు : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా;** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలో సర్పంచ్ కట్కూరి కోటేశ్వర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. గ్రామ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరయ్యారు. ఎంపీ ఓ రమేష్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో వర్షాకాల సన్నదానికి సిద్ధంగా ఉండాలి. సురక్షితమైన తాగునీరు పై శ్రద్ధ వహించాలి. ఘన వ్యర్థాల నిర్వహణ. తడి చెత్త పొడి చెత్త తో పాటు హానికరమైన చెత్తను వేరు వేరుగా చేయాలన్నారు. జల సంరక్షణ గ్రామాల్లో నూతన గృహాలు నిర్మించేవారు ఇంకుడు గుంతలను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వన మనోత్సవంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి. పర్యావరణాన్ని రక్షించాలన్నారు. సర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ చేసుకోవాలని ప్రతి ఒక్కరు సర్ ప్రక్రియలో పాల్గొనాలన్నారు. రైతులందరు రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఈ సందర్భంగా గ్రామ సభలో ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ప్రజల నుంచి పలు వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య మెరుగుదల ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి గ్రామసభలు ఉపయోగపడతాయన్నారు. గ్రామస్తులు తమ సమస్యలను గ్రామసభల ద్వారా తెలియజేస్తూరు. సమస్యల పరిష్కారానికి గ్రామ సర్పంచ్ కార్యదర్శి కృషి చేస్తారు. పాలమాకుల గ్రామాభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్వో అమరలింగం గౌడ్, శంషాబాద్ సీఐ నరేందర్ రెడ్డి, మండల ఎంపీడీవో మున్ని, మండల పంచాయతీ అధికారి రమేష్ గౌడ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.







# పంట చేలల్లో పంట అవశేషాలను తగలబెట్టొద్దు

- ప్రత్యామ్నాయ పంటల పై రైతులు దృష్టి సారించాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మహా వరంగల్ బ్యూరో;** రైతులు తాము పండించిన పంట చేలల్లో పంట అవశేషాలను తగలబెట్టకుండా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం నెక్కొండ గ్రామపంచాయతీ లో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల భూమి తన భూసారం కోల్పోతుందని ప్రజల ఆరోగ్యం పై కూడా ప్రతికూల ప్రభావం పడటంతో పాటు శ్వాసకోశ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. పొగ కారణంగా వాతావరణ మార్పులు సంభవించడంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు, పోషక పదార్థాలు నశించి భూసారం తగ్గిపోతుందని తెలిపారు. పంట అవశేషాలను రొటోవేటర్ వంటి యంత్రాలతో భూమిలో కలియదున్నడం లేదా కంపోస్టు తయారీకి వినియోగించడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చని సూచించారు. ఈ వానాకాలంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు కంది, జొన్న, నువ్వులు, వేరుశనగ, ఆముదం వంటి తక్కువ నీటి అవసరం ఉన్న పంటల సాగు పై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ పంటలకు ప్రస్తుతం మార్కెట్ లో మంచి ధరలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. రైతులు పామాయిల్ సాగు చేపట్టి అంతర పంటలుగా బంతి, కూరగాయలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. పంటలకు అవసరమైన మేరకు మాత్రమే వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన మోతాదులో ఎరువులు వినియోగించాలని, అధిక మోతాదులో ఎరువులు వాడరాదని సూచించారు.గ్రామసభలో జిల్లా పరిషత్ సీఈఓ గూడూరు రామిరెడ్డి, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మండల వ్యవసాయ అధికారి ఏ. నాగరాజు, ఎంపీడీవో వై. లావణ్య, ఎస్సై మహేందర్, పంచాయతీ కార్యదర్శి సదానందం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి నిరంతరం పర్యవేక్షించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- పెండింగ్లో ఉన్న దరఖాస్తుల పై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్



**హనుమకొండ మహా;** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును నిర్దిష్ట గడువు లోగా పరిష్కరించి, అర్జీదారులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ ఎన్. రవితో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించిన మొత్తం 365 దరఖాస్తులు అందాయి. అలాగే జిల్లా పరిధిలోని హనుమకొండ, పరకాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవోలు, సంబంధిత అధికారులు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా అందిన దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్, వాటిని సంబంధిత శాఖలకు పంపించి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రతి వినతిపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వరూపాన్ని బట్టి పరిష్కారం అందించాలని సూచించారు. ప్రజావాణి నిర్వహణలో సాంకేతిక వ్యవస్థను మరింత సమర్థవంతంగా వినియోగించాలని పేర్కొన్న కలెక్టర్, ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును ముందుగానే స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆపరేటర్లకు సూచించారు. ఒకే దరఖాస్తు కోసం ప్రజలు పదేపదే కౌంటర్ల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి రాకుండా ప్రక్రియను సరళీకృతం చేయాలని సూచించారు. ప్రతి అర్జీ ఆన్‌లైన్ వ్యవస్థలో వెంటనే ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలని, ఏ దరఖాస్తు కూడా తప్పిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అవసరమైతే దరఖాస్తుల నమోదు, డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు. గత రెండు వారాలుగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత శాఖలు వెంటనే విచారణ చేపట్టి పరిష్కార చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి కేసు పై తీసుకున్న చర్యల వివరాలతో యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలని తెలిపారు. మండల స్థాయిలో పెండింగ్ లో ఉన్న అర్జీలు ఆయా ఎమ్మార్వోలు పరిష్కరించకపోవడం పై జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వాటిని పరిష్కారానికి తహసీల్దార్లు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జడ్పీ సీఈవో శేషాద్రి, సీపీఓ సత్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారంకు మహసభలలో ప్రణాళిక

**ఈనెల 10న వ్యకాస జిల్లా మహాసభ**

కారేపల్లి, మహా : కేంద్ర రాష్ట్ర పాలకులు పేదలకు ఉపాధి కల్పనలో విఫలమైనారని దాని పర్యావసానంగా పట్టణాలకు వలసలు పెరిగాయాని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు, తాళ్లపల్లి కఅష్ణ తెలిపారు సోమవారం కారేపల్లి మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లాలోని దళిత, గిరిజన, గిరిజనేతర పేదలు అత్యధికంగా వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్నారన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు కారణంగా పనులు దొరకక పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్లి అడ్డా కూలీలుగా మారుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ గ్యారెంటీ చట్టం రద్దుచేసి వీబీజీ రామ్‌జీ బిల్లు పేరుతో కొలతలు విధానం, రెండు సార్లు ఫోటో పద్ధతి తీసుకువచ్చిందన్నారు. బడ్జెట్‌లో ఉపాధికి నిధులు తగ్గించి పేదలకు ఉపాధి దూరం చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, పెన్షన్ల పెంపు వంటి అనేక హామీలు వాగ్దానాలకే పరిమితమయ్యాయన్నారు.



# నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పా-టుకు పాఠశాలల పరిశీలిన
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

హనుమకొండ మహా; తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం అనువైన ప్రభుత్వ పాఠశాలలను గుర్తించే ప్రక్రియలో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సోమవారం కాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జీహెచ్ఎస్), శాయంపేట జాగీర్ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలల విస్తీర్ణం, మౌలిక వసతులు, తరగతి గదులు, క్రీడా మైదానాలు, విద్యార్థుల సంఖ్య, భవిష్యత్ విస్తరణకు ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో చర్చించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో విద్యా అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి విద్యార్థుల్లో ప్రతిభ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ లక్ష్యమని, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు విద్యారంగంలో నూతన మార్పులకు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పరిశీలనలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, తహశీల్దార్ రాజు, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఎంఈఓ మనోజ్ కుమార్, విద్యాశాఖ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ...బెల్లంపల్లి ఎసిపి కిరణ్ కుమార్

**బెల్లంపల్లి,మహా**: యువత మతపదార్థాలకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా రాణించాలని బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం రోజు బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు 15 వ వార్డు కౌన్సిలర్ చింతల వసంతఅధ్యక్షతన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక* 99 రోజుల కార్యచరణ ప్రణాళిక 15వ వార్డు సభ ను కెపిఆర్` స్పోర్ట్స్ క్లబ్ టేకులబస్తిలో నిర్వహించగా ముఖ్యఅతిథులు గా బెల్లంపల్లి ఎసిపి కిరణ్ తోబాటు బెల్లంపల్లి వన్ టౌన్ శ్రీనివాసరావు హాజరయ్యారు.సమావేశంలో బెల్లంపల్లితోపాటు బెల్లంపల్లి ఏసీబీ కిరణ్ తో పాటు సిఐ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మత్తు పదార్థాలకు అలవాటుపడితే భవిష్యత్తు కనుమరుగవుతుందన్నారు. అలాగే మరి కొద్ది రోజుల్లో స్కూల్స్, కాలేజీలు ప్రారంభం కాబోతున్నాయి మహిళలు ఆడపిల్లలు జాగ్రత్తగా ఉండాలని రోడ్లపై చిలిపి చేష్టలు ఆకతాయి వేషాలు వేసే వారి గురించి తప్పకుండా తల్లిదండ్రులకు ఇంట్లో తెలియపరచాలన్నారు.112 నంబర్ కు డయల్ చేసి తెలియపరిస్తే పోలీసులు తప్పకుండా తగు చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి చర్యలు జరగకుండా కట్టడి చేస్తామన్నారు.వార్డు కౌన్సిలర్ చింతల వసంత వార్డు సభను ఉద్దేశించి మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు, 2026 వర్షపు నీటి సేకరణ నిర్మాణం "జల్ సంచయ్ జల్ భాగీధారి" కింద నిర్మాణాలు. మురుగునీటి కాలువల పూడికతీత మరియు శుభ్రపరచడం వర్షాకాల సన్నద్ధత కోసం కార్యాచరణ ప్రణాళిక, తాగునీటి సరఫరా మరియు నిర్వహణ నీరు నిలిచిపోకుండా నివారణ, మరియు పారిశుధ్యం రోడ్లు, వీధి దీపాల నిర్వహణ మొక్కల పెంపకం మరియు పర్యావరణ పరిరక్షణ కార్యకలాపాలు ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఒక్క మొక్క నాటి ప్రకృతిని కాపాడుకుంటేనే మనకు భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు.వార్డు సభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన రిటైర్డ్ ఏసిపి పులియాల రవికుమార్ మాట్లాడుతూ యువకులు నేటి తరంలో తప్పకుండా మంచి ఆలోచనలు కలిగి తల్లిదండ్రులను గౌరవించాలన్నారు.మత్తు పదార్థాలకు దూరం ఉండి మంచి భవిష్యత్తుకు మనమే దారి వేసుకోవాలన్నారు. భవిష్యత్తులో ప్రతి ఒక్కరు కూడా ముఖ్యంగా గమనించాల్సింది ఎవరి కుటుంబంలోనైనా కార్యక్రమం జరిగినా స్పోర్ట్స్ క్లబ్`ను ఫ్రీ గా కార్యక్రమాలు చేయడానికి ఇస్తానని సభ సాక్షిగా తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ ఐ గోపాల్,బెల్లంపల్లి మున్సిపల్ ఏఈ నిఖిల్, అంగన్వాడీ టీచర్ పద్మా, 15 వార్డు ఆఫీసర్ అంబాల రాజేంద్రప్రసాద్,అశోక్ కుమార్, ఆర్పీ శ్రీలత, మంచిర్యాల జిల్లా టి పి సి సి మీడియా కన్వీనర్ దేవసాని ఆనంద్,ఆశా కార్యకర్త సుజాత మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# హనుమకొండ డిఎంహెచ్వో గా డాక్టర్ ఎస్ దుర్గా రామ్ కుమార్

**హన్మకొండ మహా;** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ బదిలీల్లో భాగంగా హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ ఎస్ దుర్గా రాంకుమార్ ను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ ని కలిసి రిపోర్ట్ చేయడం జరిగింది. గతంలో వీరు కూకట్ పల్లి జోన్ డిఎంహెచ్వో గా పని చేస్తూ బదిలీ పై హనుమకొండకు రావడం జరిగింది.ప్రస్తుతం హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ అల్లం అప్పయ్య ను ములుగు జనరల్ ఆస్పత్రి ఆర్ఎంఓ గా నియమించడం జరిగింది. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీఎన్ రవి ,డి ఆర్ ఓ శ్రీ శ్రీనివాస్ లను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అంతేకాకుండా డిప్యూటీ సివిల్ సర్జన్ లుగా డాక్టర్ సిహెచ్ మురళి తో పాటు డాక్టర్ పవిత్ర లు జిల్లాకు బదిలీ పై రావడం జరిగింది.ఈ సందర్భంగా అధికారులు సిబ్బంది అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎం హెచ్వోమదన్ మోహన్ రావు , డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ రుబీనా అప్రోజ్ ఏవో కోలా రాజేశ్, జిల్లా మాస్ ఎడ్యుకేషన్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, హెచ్ ఈ ఈ ఓ చంద్రశేఖర్ , డిపిఓ రుక్మద్దీన్, ప్రసన్న కుమార్ ,ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండ డిఎంహెచ్వో గా డాక్టర్ ఎస్ దుర్గా రామ్ కుమార్

**హన్మకొండ మహా;**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ బదిలీల్లో భాగంగా హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ ఎస్ దుర్గా రాంకుమార్ ను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ ని కలిసి రిపోర్ట్ చేయడం జరిగింది. గతంలో వీరు కూకట్ పల్లి జోన్ డిఎంహెచ్వో గా పని చేస్తూ బదిలీ పై హనుమకొండకు రావడం జరిగింది. ప్రస్తుతం హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ అల్లం అప్పయ్య ను ములుగు జనరల్ ఆస్పత్రి ఆర్ఎంఓ గా నియమించడం జరిగింది. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీఎన్ రవి,డి ఆర్ ఓ శ్రీ శ్రీనివాస్ లను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అంతేకాకుండా డిప్యూటీ సివిల్ సర్జన్ లుగా డాక్టర్ సిహెచ్ మురళి తో పాటు డాక్టర్ పవిత్ర లు జిల్లాకు బదిలీ పై రావడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్వోమదన్ మోహన్ రావు, డిప్యూటీ డిఎం హెచ్ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ రుబీనా అప్రోజ్ ఏవో కోలా రాజేశ్, జిల్లా మాస్ ఎడ్యుకేషన్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, హెచ్ ఈ ఈ ఓ చంద్రశేఖర్, డిపిఓ రుక్మద్దీన్, ప్రసన్న కుమార్,ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి పేదవాడికీ ఇందిరమ్మ ఇల్లు

- కూసుమంచిలో నూతన విద్యుత్ కార్యాలయం, గృహప్రవేశాల్లో పాల్గొన్న మంత్రి.



**ఖమ్మం, మహా:** రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని ఆయన ఉద్ఘాటించారు. సోమవారం ఖమ్మం జిల్లా కూసుమంచి, ఏదులాపురం పరిధిలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు.

**నిర్మాణ పురోగతి ఆధారంగా ప్రతి సోమవారం బిల్లులు**

కూసుమంచి మండలంలోని రాజుపేట, గట్టు సింగారం గ్రామాల్లో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ముచ్చటించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కేవలం ఇళ్ల మంజూరుకే పరిమితం కాకుండా, నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రతి సోమవారం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు జమ చేస్తున్నట్లు వెల్లడించారు. రాజుపేటలో మంజూరైన వాటిలో నాలుగు పూర్తవగా, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. గట్టు సింగారంలో 19 ఇళ్లకు గాను 10 పూర్తి చేసుకుని లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసినట్లు వివరించారు. ఏ ఒక్క పేదవాడు ఇల్లు లేకుండా మిగిలిపోకూడదనే ఉద్దేశ్యంతో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టామని, చివరి లబ్ధిదారుడికి కూడా ఇల్లు అందేలా దశలవారీగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని భరోసా ఇచ్చారు.


**విద్యుత్ సమస్యల పరిష్కారానికి నూతన కార్యాలయం**

ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సేవలు అందించేందుకు ప్రభుత్వం మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా కూసుమంచి మండల కేంద్రంలో రూ.35 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన విద్యుత్ రెవెన్యూ కార్యాలయ భవనాన్ని (ఈఆర్వో) ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరుగుతున్న దృష్ట్యా, వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా చేయడంతో పాటు సమస్యలను, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ నూతన కార్యాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో కూడుకున్నా.. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని మంత్రి పొంగులేటి గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి హామీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో స్వయం సహాయక సంఘాలకు ఇప్పటివరకు రూ.66 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించినట్లు తెలిపారు. రెండో విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మరో రెండు వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ తర్వాత మూడు, నాలుగో విడతల్లోనూ ఇళ్ల మంజూరు కొనసాగుతుందని ప్రకటించారు. త్వరలోనే ఆసరా పెన్షన్లు మంజూరు చేస్తామని, రాబోయే నెల రోజుల్లో పాలేరు నియోజకవర్గ పరిధిలోని భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోనుందని వెల్లడించారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మన్ నవీన్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఇతర ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు భువనగిరికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**యాదాద్రి భువనగిరి జూన్ 8 మహా** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హోదాలో తొలిసారిగా మంగళవారం భువనగిరిలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణిల ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా అధికార యంత్రాంగం కూడా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేసింది. పర్యటనలోని ముఖ్య కార్యక్రమాలు: టీజీ ఎస్పీడీసీఎల్ (TGSPDCL) యాదాద్రి భువనగిరి జిల్లా సర్కిల్ పరిధిలో, భువనగిరి పట్టణంలోని ఓంకార్ థియేటర్ పక్కన ₹5.83 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన సర్కిల్ కార్యాలయ భవనాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. భూదాన్ పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామంలో ₹2.67 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను కూడా ఈ సర్కిల్ కార్యాలయం నుంచే రిమోట్ ద్వారా ప్రారంభిస్తారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం వల్ల సుమారు 1,279 మంది రైతులకు నాణ్యమైన విద్యుత్ అంది లబ్ధి చేకూరుతుంది. భువనగిరి మండలం హనుమపురం గ్రామంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఎదురుగా ₹2.03 కోట్లతో నిర్మించనున్న 'స్టోర్ కాంప్లెక్స్'కు, అలాగే వలిగొండ మండలం నర్సాపూర్ గ్రామంలో ₹3.52 కోట్లతో చేపట్టనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమాల అనంతరం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఆ తర్వాత ప్రజలను ఉద్దేశించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగిస్తారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు టీజీ ఎస్పీడీసీఎల్ యాదాద్రి భువనగిరి సర్కిల్ ఎస్ఈ (SE) సురేష్ తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ డిప్యూటీ సీఎం పర్యటనను పురస్కరించుకొని సోమవారం భువనగిరిలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణి పర్యటించి ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేష్‌తో మాట్లాడి, కార్యక్రమ నిర్వహణ, ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, పీసీసీ డెలిగేట్ సభ్యులు తంగేళ్లపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | మంగళవారం, హైదరాబాద్ | 09-06-2026
ANN తెలుగు



# వరలక్ష్మి హారర్ థ్రిల్లర్‌లో ప్రత్యేక గీతం ఆకట్టుకుంటోంది

నవీన్ చంద్ర, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న హారర్ థ్రిల్లర్ చిత్రం పోలీస్ కంప్లైంట్ విడుదలకు సిద్ధమవుతోంది. విభిన్న కథాంశంతో రూపొందిన ఈ చిత్రం జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార కార్యక్రమాలతో సినిమాపై మంచి ఆసక్తి ఏర్పడింది. ఇప్పుడు తాజాగా విడుదలైన ప్రత్యేక గీతం సినిమాపై మరింత చర్చకు దారితీసింది.సంజీవ్ మేగోటి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మించారు. హారర్, థ్రిల్లర్, యాక్షన్, ఎమోషన్స్ కలగలిపిన కథతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించబోతోందని చిత్రబృందం చెబుతోంది.

తాజాగా విడుదలైన ప్రత్యేక గీతం ఈ సినిమాకు అదనపు ఆకర్షణగా మారింది. కృష్ణసాయి, కృతి వర్మలపై చిత్రీకరించిన ఈ పాటను సూపర్‌స్టార్ కృష్ణకు నివాళిగా రూపొందించారు. సూపర్‌స్టార్ కృష్ణ సినీ ప్రయాణం, ఆయన వారసత్వాన్ని గుర్తు చేస్తూ రూపొందిన ఈ గీతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పాటలో కనిపించే విజువల్స్, భావోద్వేగాలు, సంగీతం కలిసి ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తున్నాయి.ఈ ప్రత్యేక గీతాన్ని వీక్షించిన సూపర్‌స్టార్ కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు చిత్రబృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పాట చాలా అద్భుతంగా వచ్చిందని ప్రశంసిస్తూ, సినిమా మంచి విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఆయన నుంచి వచ్చిన ప్రశంసలు చిత్ర యూనిట్‌కు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయని దర్శకుడు తెలిపారు.దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, సూపర్‌స్టార్ కృష్ణ కుటుంబం నుంచి వచ్చిన అభినందనలు తమకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ చిత్రాన్ని కేవలం 45 రోజుల్లో పూర్తి చేశామని, దాదాపు 52 మంది సీనియర్ ఆర్టిస్టులు ఈ సినిమాలో భాగమయ్యారని వెల్లడించారు. ముఖ్యంగా 'కర్మ ప్రభావాల పరంపర' అనే ప్రత్యేక కాన్సెప్ట్ చుట్టూ కథ తిరుగుతుందని, ఇది సాధారణ హారర్ చిత్రం కాదని చెప్పారు. హారర్ థ్రిల్లర్ కథలోనే యాక్షన్, భావోద్వేగాలు, మిస్టరీ అంశాలను కలిపి రూపొందించిన ఈ ◌సినిమా ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెడుతుందని చిత్రబృందం నమ్మకం వ్యక్తం చేస్తోంది.ఈ చిత్రంలో కృష్ణసాయి, రాగిణి ద్వివేది, ఆదిత్య ఓం, రవిశంకర్, పృథ్వి, కృతి వర్మ, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి తదితరులు కీలక పాత్రలు పోషించారు. విభిన్న నటీనటులతో రూపొందిన ఈ హారర్ థ్రిల్లర్ విడుదల తర్వాత ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.



## భావోద్వేగానికి గురైన రామ్ చరణ్

డైరెక్టర్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన *'పెద్ది'* బాక్సాఫీస్ వద్ద విజయపథంలో దూసుకుపోతోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీ వసూళ్లను నమోదు చేస్తూ ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతోంది. సినిమా ఘన విజయాన్ని సెలబ్రేట్ చేసుకునేందుకు చిత్రబృందం నిర్వహించిన *'బాక్సాఫీస్ ఛాంపియన్ థ్యాంక్యూ మీట్'* కార్యక్రమంలో పాల్గొన్న రామ్ చరణ్ తన ఆనందాన్ని, భావోద్వేగాన్ని అభిమానులతో పంచుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన రామ్ చరణ్, సినిమా చూసిన తర్వాత తనకు మాటలు రావడం లేదని అన్నారు. ఇటీవల సాధారణ ప్రేక్షకులతో కలిసి థియేటర్‌లో సినిమా వీక్షించినట్లు చెప్పిన ఆయన, ప్రేక్షకుల స్పందన తనను ఆశ్చర్యపరిచిందని వెల్లడించారు. పెద్ద మాస్ థియేటర్లలో వచ్చే స్పందన మల్టీప్లెక్స్‌లలో కూడా కనిపించడం ఎంతో సంతోషంగా అనిపించిందన్నారు. తాను పెద్దగా స్పందన రాదనుకున్న కొన్ని సన్నివేశాలకు కూడా ప్రేక్షకులు చప్పట్లు కొట్టడం చూసి ఎంతో ఎమోషనల్ అయ్యానని చెప్పారు.

తన సినీ ప్రయాణంలో ఈ సినిమా ప్రత్యేక స్థానం సంపాదించుకుందని రామ్ చరణ్ వెల్లడించారు. తన కెరీర్‌లో అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా ఈ సినిమా నిలిచిపోతుందని, కథ విన్న మొదటి రోజే దర్శకుడు బుచ్చిబాబును హత్తుకుని అభినందించానని తెలిపారు. ఒక మంచి కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే దర్శకుడి కృషి ఇప్పుడు ఫలితాన్ని ఇస్తోందన్నారు. కథ మొదటిసారి విన్నప్పుడు ఇది రిస్క్‌తో కూడుకున్న కథగా అనిపించిందని కూడా చరణ్ తెలిపారు. కథ ఎటువైపు వెళ్తుందో అర్థంకాక కొంత సందేహం కలిగిందన్నారు. అయితే, నిజాయితీగా కష్టపడి పనిచేస్తే ఎలాంటి కథ అయినా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఈ సినిమా మరోసారి నిరూపించిందన్నారు.

దేశంలోనే కాదు విదేశాల్లో కూడా సినిమాకు అద్భుతమైన స్పందన వస్తోందని చరణ్ చెప్పారు. అమెరికా, బ్రిటన్, దుబాయ్ సహా అనేక ప్రాంతాల్లో ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారని, కుటుంబాలుగా థియేటర్లకు రావడం తనకు మరింత ఆనందాన్ని ఇస్తోందన్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరూ సినిమా చూసి ఆనందపడటం ఈ విజయానికి అసలైన గుర్తింపని పేర్కొన్నారు.ఇదే సందర్భంగా సినిమాలోని ఓ నటుడి నటన తనను తీవ్ర భావోద్వేగానికి గురిచేసిందని రామ్ చరణ్ అన్నారు. "ఈ సినిమాలో ఆయన నటన చూసి నాకు కంట్లో నీళ్లు వచ్చాయి" అంటూ చెప్పిన వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానుల్లో చర్చకు దారితీస్తున్నాయి. సినిమా విజయంతో పాటు భావోద్వేగపూరిత కథనం, పాత్రల ప్రభావం ప్రేక్షకులను ఎంతగా తాకిందో చరణ్ మాటల్లో స్పష్టంగా కనిపించింది.



### మాస్ యాక్షన్ టీజర్‌తో

# అంచనాలు రెట్టింపు

తమిళ స్టార్ నటుడు విజయ్ సేతుపతి హీరోగా, టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం స్లమ్ డాగ్ - 33 టెంపుల్ రోడ్ ఇప్పుడు సినీ అభిమానుల్లో హాట్ టాపిక్‌గా మారింది. విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వస్తున్న విజయ్ సేతుపతి, తన మాస్ మార్క్ సినిమాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పూరి జగన్నాథ్ తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై మొదటి నుంచే భారీ ఆసక్తి నెలకొంది. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన టీజర్ ఆ అంచనాలను మరింత పెంచేసింది.

"ఒక్క వాన పడితే కాకుల్లా చెట్ల కింద దాక్కొనే జీవితాలు మావి.. అలాంటి మా బతుకులతో ఆడుకుంటే నేనెందుకు వదులుతా" అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ప్రారంభమైన టీజర్ మొదటి క్షణం నుంచే ప్రేక్షకులను కథలోకి తీసుకెళ్తోంది. పేదరికం, బాధలు, అన్యాయం మధ్య జీవించే ఓ సామాన్యుడి జీవితాన్ని కేంద్రంగా చేసుకుని ఈ కథ సాగనున్నట్లు టీజర్ స్పష్టంగా సూచిస్తోంది. సాధారణ మనిషి కోపం ఎంత ప్రమాదకరంగా మారుతుందో చూపించే ప్రయత్నం ఇందులో కనిపిస్తోంది.

టీజర్‌లో విజయ్ సేతుపతి లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాధారణ వ్యక్తిగా కనిపిస్తూనే, అవసరమైనప్పుడు విరుచుకుపడే పాత్రలో ఆయన కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో ఆయన చూపించిన తీవ్రత, ఎమోషనల్ ఎక్స్‌ప్రెషన్స్ టీజర్‌కు మరింత బలం చేకూర్చాయి. పూరి సినిమాల్లో కనిపించే మాస్ ఎలిమెంట్స్, వేగవంతమైన సన్నివేశాలు, పవర్‌ఫుల్ డైలాగ్స్ ఈ టీజర్‌లో కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. పూరి జగన్నాథ్ చాలా కాలం తర్వాత మళ్లీ తనకు పేరుతెచ్చిన స్టైల్‌లో కనిపిస్తున్నారనే అభిప్రాయాలు ఇప్పటికే అభిమానుల్లో వ్యక్తమవుతున్నాయి. బలమైన భావోద్వేగాలు, సామాజిక నేపథ్యం, మాస్ యాక్షన్—all కలిపి ప్రేక్షకులకు కొత్త అనుభూతి ఇవ్వాలని దర్శకుడు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. టీజర్ మొత్తం చూసిన తర్వాత ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా, బలమైన భావోద్వేగాలతో కూడిన కథగా ఉండబోతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.ఈ చిత్రంలో ప్రముఖ నటి సంయుక్త కీలక పాత్రలో కనిపించనుండగా, సీనియర్ నటి టబు కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వీరి పాత్రలు కథకు ఎంత కీలకమో టీజర్‌లో పూర్తి వివరాలు చూపించకపోయినా, సినిమా కథలో బలమైన పాత్రలుగా ఉండబోతున్నట్లు సంకేతాలు ఇచ్చారు.సినిమా నేపథ్యం, పాత్రల రూపకల్పన, విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్—all కలిసి టీజర్‌ను మరింత ఆసక్తికరంగా మార్చాయి. ముఖ్యంగా చివర్లో వచ్చే యాక్షన్ షాట్స్, విజయ్ సేతుపతి ఇంటెన్స్ ప్రెజెన్స్ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారి తీస్తున్నాయి.

ఇప్పటికే టీజర్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తుండగా, ఈ సినిమా విడుదల తేదీ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విడుదల తేదీని చిత్రబృందం త్వరలో ప్రకటించనుంది. విజయ్ సేతుపతి - పూరి జగన్నాథ్ కాంబినేషన్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

### అందం, అభినయం

# ఆకట్టుకుంటున్న జఫ్రో ఎస్ ఖాన్

మెరిసే అందం, ఆకట్టుకునే ఆత్మవిశ్వాసం, సంప్రదాయం-ఆధునికత కలయికగా నిలిచే ఈ స్టూడియో చిత్రంలో జఫ్రో ఎస్ ఖాన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వెండి రంగు నూలు పనితో అద్భుతంగా అలంకరించిన లేత గులాబీ రంగు లెహంగా చోళీ ధరించిన ఆమె రూపం గ్లామర్‌కు కొత్త అర్థం చెబుతోంది. పొడవాటి నల్లని అలలలా జారే జుట్టు, పదునైన కళ్ల చూపులు, ధైర్యంగా కనిపించే హావభావాలు ఈ చిత్రానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. సంప్రదాయ దుస్తుల్లో ఆధునిక అందాన్ని కలిపి చూపించే ఈ రూపం అభిమానులను ఆకట్టుకునేలా ఉంది. జనవరి 1, 1992న లండన్‌లో జన్మించిన జఫ్రో ఎస్ ఖాన్, మొదట జారా ఆఘా ఖాన్ పేరుతో గుర్తింపు పొందారు. నటిగా, గాయనిగా తన ప్రతిభను చాటుకున్న ఆమె సినీ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ, తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును నిర్మించుకున్నారు. ప్రముఖ నటి, గాయని సల్మా ఆఘా కుమార్తెగా సినీ ప్రపంచంలో అడుగుపెట్టిన ఆమె చిన్న వయసులోనే కళల పట్ల ఆసక్తి పెంచుకున్నారు. ఆమె సినీ ప్రయాణం ప్రముఖ నిర్మాణ సంస్థ రూపొందించిన చిత్రంతో ప్రారంభమైంది. తొలి చిత్రంలోనే ప్రముఖ నటుడితో కలిసి నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. అదే సమయంలో ఆ చిత్రానికి సంబంధించిన పాటలో గాత్రం అందించి నటనతో పాటు గాన ప్రతిభను కూడా నిరూపించారు. అనంతరం మరిన్ని చిత్రాల్లో నటిస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించారు.నటన, సంగీతం రెండింటినీ సమతూకంగా కొనసాగిస్తున్న జఫ్రో ఎస్ ఖాన్ విభిన్న కథలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. చిన్న చిత్రాలు, ప్రత్యేక ప్రాజెక్టులు, విభిన్న పాత్రల ద్వారా తనలోని కళాకారిణిని కొత్త కోణాల్లో చూపిస్తున్నారు. పలు భాషల్లో రూపొందుతున్న భారీ ప్రాజెక్టుల్లో భాగమవుతూ విస్తృత స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు.

ప్రస్తుతం కూడా పలు ఆసక్తికర చిత్రాలు, సంగీత ప్రాజెక్టులతో బిజీగా ఉన్న జఫ్రో, కొత్త తరానికి చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలుస్తున్నారు. అందం, ప్రతిభ, ఆత్మవిశ్వాసం, కృషి కలిస్తే ఎలా ప్రత్యేక గుర్తింపు సాధించవచ్చో ఆమె ప్రయాణం చెబుతోంది. సినీ ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ యువ కళాకారిణి భవిష్యత్తులో మరింత పెద్ద విజయాలను అందుకుంటారని అభిమానులు ఆశిస్తున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com